PRAMUKHANDHRA    28th Year of Publication    We carry the news and views of Telugus



వ్యవస్థాపకులు
శ్రీ గోటేటి శ్రీరామారావు


28 వ సంవత్సరం


# ప్రముఖాంధ్ర


₹.15
నవంబర్ 2022


THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA, GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA











# సాహస హీరో



అతడొక అసాధ్యుడు. అసాధ్యుడే కాదు అఖండుడు కూడా. ఉంగరాలజుట్టుతో, ఊరించే కన్నులతో బుర్రిపాలెం అనే కుగ్రామం అందించిన నూటొక్క జిల్లాలకి అందగాడు. హేమాహేమీలుగా వున్న ఎన్టీఆర్, ఏయన్నార్ లు చలనచిత్ర రంగాన్ని ఏలుతున్న సమయంలో అడుగుపెట్టి, సాహసమే ఊపిరిగా, పట్టుదలే సోపానంగా, ఓటమే విజయానికి పునాదిగా నమ్మి అంచలంచలుగా సూపర్ స్టార్ స్థాయికి ఎదిగిన సుకుమారుడు, నటశేఖరుడు, పద్మవిభూషణుడు ఘట్టమనేని కృష్ణ. తెలుగు చలనచిత్ర రంగంలో నూతన ఒరవడి సృష్టించి, అధునాతన సాంకేతిక విలువలకు పట్టంకట్టి, సినిమాలు నిర్మించి, నష్టపోయి, పడిలేచిన కెరటంలా విజృంభించి నాలుగు దశాబ్దాలపాటు తనదైన ముద్రతో అభిమానులను అలరించిన కృష్ణ, సెల్యూలాయిడ్ కర్షకుడు. ఇన్నేళ్లు గడుస్తున్నా కృష్ణ అనగానే గుర్తుకొచ్చేది సూపర్ స్టార్ హెూదా. అటువంటి మేరు నగధీరుడు చలనచిత్రనటనకు విరమణ ప్రకటించినా అభిమానుల హృదయాల్లో సూపర్ స్టార్ గానే స్థిరంగా నిలిచి వున్నాడు. ఈ సూపర్ స్టార్ 14 నవంబర్ 2022 (సోమవారం) తెల్లవారుజామున హృద్రోగ సమస్యతో హైదరాబాద్ కాంటినెంటల్ ఆసుపత్రిలో తన అభిమాన జనసందోహాన్ని దుఃఖ సముద్రంలో ముంచి తన యనభయ్యవ పడిలో సుదూరంగా పరలోకానికి ప్రయాణం కట్టిన విషయాన్ని అభిమానులు, స్నేహితులు, హితులు జీర్ణించుకోలేక వున్నారు. ఒకసారి ఆ మహా మనీషి జీవన ప్రస్థానాన్ని గుర్తుచేసుకుందాం.

## సూపర్ స్టార్

తన సినీ ప్రస్థానంలో ఎన్నో సాహసాలు చేసిన ఈ అసాధ్యుడు డేరింగ్ & డాషింగ్ హీరోగా పిలిపించుకున్నారు. సూపర్ స్టార్ అనిపించుకున్నారు. 1969-72 మధ్య నాలుగేళ్ళలోనే 60 చిత్రాలలో నటించిన ఘనత పొందారు. రోజూ మూడు షిఫ్టుల్లో ఉదయం 7 నుంచి రాత్రి 10 గంటలదాకా ఏకబిగిన నటించి నిద్రలేని రాత్రులు గడిపిన సంఘటనలు కృష్ణ చలనచిత్ర ప్రస్థానంలో ఎన్నో! కృష్ణ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'సింహాసనం' సినిమా తెలుగులో తొలి 70ఎం.ఎం చిత్రంగా చరిత్ర పుటల కెక్కింది. బప్పిలహరిని తెలుగులో సంగీత దర్శకునిగా పరిచయం చేసిన ఘనత కూడా కృష్ణదే! తాష్కెంట్ ఫిలిం ఫెస్టివల్లో 'సాక్షి' సినిమాలో కృష్ణ నటనకు ప్రశంసలు లభించాయి. కృష్ణ నటజీవితంలో మొత్తం 80 మంది హీరోయిన్ల సరసన నటించారు. అందులో 47 సినిమాల్లో విజయనిర్మలే హీరోయిన్. జయప్రద 42 చిత్రాల్లో, శ్రీదేవి 31 చిత్రాల్లో నటించి, అందమైన జోడీలుగా గుర్తింపు పొందారు. 'అల్లూరి సీతారామరాజు' చిత్రంలో శ్రీశ్రీ రాసిన "తెలుగువీర లేవరా" పాటకు జాతీయ స్థాయిలో ఉత్తమ గీతరచయిత బహుమతిని సాధించారు. ఒక తెలుగు చిత్రానికి జాతీయస్థాయి బహుమతి రావడం ఇదే ప్రథమం. 'పండంటి కాపురం', 'దేవుడు చేసిన మనుషులు', 'పాడిపంటలు', 'రామరాజ్యంలో రక్తపాశం' వంటి కుటుంబకథా చిత్రాలను నిర్మించి అభిరుచిగల నిర్మాతగా కీర్తినార్జించారు. 'దేవదాసు' సినిమాను పునర్నిర్మించి తన సాహసాన్ని నిరూపించుకున్నారు. ఎన్టీఆర్ 'దాన వీర శూర కర్ణ' సినిమాకి పోటీగా 'కురుక్షేత్రం' చిత్రం నిర్మించి సంక్రాంతి కానుకగా ఒకేరోజు విడుదల చేసి ధీరుడనిపించుకున్నారు. 1980లో హిందీ చిత్రరంగ ప్రవేశం చేసి జితేంద్రను హీరోగా పెట్టి 'సింఘాసన్' చిత్రాన్ని నిర్మించారు. 2009లో భారత ప్రభుత్వం కృష్ణకు 'పద్మభూషణ్' పురస్కాన్ని ప్రదానం చేసింది. కృష్ణకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. మహేశ్ బాబు సంచలన హీరోగా అలరారుతున్నారు. మంచితనం, నిజాయితీ, నిబద్ధత కృష్ణకున్న సుగుణాలు. సగటు ప్రేక్షకుడి వినోద సాధనమైన సినిమా కన్నులపండువగా వుండాలని ఆశించి, తెలుగు సినిమాకు భారీతనాన్ని చేకూర్చి, కళ్ళముందు స్వప్నజగత్తును ఆవిష్కరించిన ఘనత కృష్ణదే! తెలుగు చిత్రసీమ కృష్ణకు ఎప్పుడూ రుణగ్రస్తురాలై వుంటుంది.

–ఆచారం షణ్ముఖాచారి



# ప్రముఖాంధ్ర

## ప్రపంచ తెలుగుల మానస పత్రిక

నవంబరు 2022

సంపుటి : 28 (336) సంచిక : 11




# భారతదేశ పురోగమానికి హిందూత్వమే శరణ్యం!

భారతీయత, హిందూత్వంలోని ఔన్నత్యాన్నిగానీ, ఔదార్యాన్నిగాని నేటి రాజకీయ వ్యవస్థా, అధిక శాతం ప్రజలూ గ్రహించకపోవడం వల్లనే హిందూత్వంపై ద్వేషాన్ని పెంచుకుంటున్నారు. దీనికి ప్రధాన కారణం హిందూత్వాన్నీ ఒక మతంగా పరిగణిస్తూండడమే! హిందూత్వాన్ని ఒక సర్వజన సుఖైక జీవన ధర్మంగా గ్రహించి ఉంటే ఈ ద్వేషం ప్రబలేది కాదు, ప్రతీ అవివేకి నోటివెంటా 'మతతత్వం' అనే మాట వెలువడేది కాదు.

మానవ సమాజానికే సుఖజీవనం, ధర్మప్రవర్తనం, సత్యసంపదలను నేర్పినదొక హిందూ ధర్మమే. నోరున్న మనిషి నుంచీ, నోరు లేని పశు పక్ష్యాది కీటకాలనూ, స్థిర జడములుగా ఉండే వృక్ష, పర్వతములనూ, ప్రవహించే నదీ, నద, సాగరాలనూ పూజించి, గౌరవించే సంస్కారాన్ని నేర్పినది. వేద సంస్కృతీ పరమైన హిందూ ధర్మమే, పాంచ భౌతికమైన ఈ శరీరం పంచభౌతిక ప్రకృతితో ముడివడి ఉన్నదనే సత్యాన్ని శాస్త్రం (సైన్సు)గా నిరూపించింది; నిర్ధారించి ప్రపంచానికి శాస్త్రబోధకురాలైంది.

భారత రాజ్యాంగ రచనా సంస్కర్తలైన, అంబేద్కర్ అయినా, గాంధీయైనా, నెహ్రూయైనా – మరో బౌద్ధ, జైన, శిక్కు మత స్థాపకులైన బుద్ధ, మహావీర, నానక్‌లైనా మానవత్వంలోని మహత్తరమైన సమానత్వం, పరస్పరావగాహనంతో బాటు పరస్పర సహకార గుణం స్వభావం కలిగే సమాజాన్ని హిందూత్వం తీర్చిదిద్ద కలిగిందంటే అది వేల యేండ్లగా వస్తూన్న వేద ప్రభావిత (వేద ప్రజ్వలిత) సనాతన ధర్మ ప్రభావ ప్రసాదితమే!


దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన సమయంలో మతప్రాతిపదికగా ముస్లిము సోదరులు పాకిస్థాన్‌గా విడివడి, తమ మత సాంస్కృతికపర దేశంగా ఏర్పడగా, శేషించిన మన దేశం హిందూ ధర్మ దేశం గాకుండా సోదర మతస్థులందరినీ తన అక్కున చేర్చుకున్న సెక్యులర్ దేశమైంది. సమాన గౌరవ ప్రతిపత్తులనిచ్చి తన ఔదార్యాన్ని చాటుకున్న ప్రపంచాగ్ర గురుస్థానదేశంగా రూపొందింది.

సర్వమత సమానత, సహన సౌశీలత, తాత్విక చింతన, ధార్మిక భావన, పరస్పర సహకార వృత్తుల కారణంగానే సహజీవనం ఏర్పడింది. కలహాలు లేని నిత్య మనుగడ నేర్పరచుకున్న దేశంగా భారతదేశం వర్ధిల్లింది. స్వాతంత్ర్యం ఏర్పడిన పిదప రాజ్యాంగ రచనాకర్తలు కూడా, మౌలికమైన సూత్రాలు గల సనాతనధర్మాన్నే మార్గంగా చేసుకుని భారత రాజ్యాంగ రచన చేశారు. పచ్చని కాంతుల్ని తనపై పరుచుకున్న భూదేవి పసిడిపంటలనిస్తూ, భూజనుల ఆకలి దప్పులను తీరుస్తూంటే, పౌరుల ముఖాబింబాలు వేయి శరత్‌చంద్రుల చంద్రికా ధవళకాంతులు కురిపించిన చందంగా సుఖసంతోషాలతో విలసిల్లుతున్న దేశం, హిందూ దేశమని విదేశీ పర్యాటకులు విశ్లేషించారు. ప్రయాణం చేసి అలసి సొలసిన నత్త తన దేహాన్ని గుల్లలోకి చేర్చి విశ్రమించినట్టు, పగలంతా కష్టించిన జనం, రాత్రి తమ తమ గృహాల్లో శాంతి సుఖాలతో తలదాచుకుంటూ సుఖజీవనం సాగించారు కాబట్టే, మన దేశం 'శ్రీలు చెందిన భారతదేశంగా శాంతిధామంగా వర్ధిల్లింది.

మనం చేసే పనిని నిష్కామంగా చేయాలనీ, ఫలాపేక్షరహితంగా ఉండాలనీ, మంచి పనుల్ను చేసేవారిని ఆదర్శంగా తీసుకుంటూ, వారి మార్గంలో నడచిననాడు అసూయా ద్వేషాలకు తావులేని సమసమాజం ఏర్పడుతుందనెడి భావంతో రాజ్యాంగ రచన చేశారు. సర్వమత సమైక్యత, సమాన ప్రతిపత్తి, అందరూ ఒకటేనను సమభావం వర్ధిల్లుతుందనీ, హెచ్చుతగ్గులు లేని సమభావన కలుగుతుందని పెద్దలు భావించారు.

రాగద్వేషాల కతీతంగా మనసు కలిగి ఉండాలి, సమస్త ప్రాణులకూ ఉపకారం చేయాలి, అహింసా విధానాన్ని 'తూ.చ.' తప్పకుండా పాటించాలి. క్రౌర్య, కాఠిన్య, ద్వేష భావాల్ని విడనాడాలి. పరోపకారాన్ని పరమధర్మంగా భావించాలి. తాను చేసుకున్న పుణ్యమే తనని రక్షిస్తుందనెడి భావంతో పుణ్యకార్యాలనేచేయాలి. అనన్యభక్తితో తమ తమ ఆరాధ్య దైవాలను ఆరాధించాలి. ఆరాధనలోనే శాంతి ఉన్నదన్నదే హైందవ మూల సిద్ధాంతం. అలాటి హైందవత్వాన్ని, మతతత్వంగా భావించి తిరస్కరించడం మూర్ఖత్వమవుతుంది.

'జైహింద్', 'వందేమాతరం' అనే నినాదాలతో భారతీయులందరూ స్వాతంత్ర్య నినాదం చేశారు. బ్రిటీష్ కొరడాలకు, తుపాకీ గుళ్లకు రక్తార్పణం చేశారు. విభేదాలను సృజించి, జన విభజనం కావించకుండా సమైక్యతా మూర్తులైన యువ తకు మార్గనిర్దేశం చేశారు. రాజకీయ నాయకులు పరస్పర దూషణం విడనాడి దేశాభివృద్ధిపై దృష్టిని సారించిన నాడు, స్వతంత్ర భారత పూర్ణఫలాలను అందుకోగలం. ఆ శుభదినం కోసమే ఎదురు చూద్దాం. భారతదేశ పురో గమనానికి హిందూ త్వమే శరణ్యమనే సత్యాన్ని గ్రహిద్దాం.



*బుధజన విధేయుడు*

*– గోటేటి శ్రీరామారావు*

(ఆగస్ట 2008)


Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**





## భక్తిని ముక్తిని ప్రసాదించే

# అళగర్ ఆలయ కళ్లలగర్

పలు యుగాలకు ముందు భారతదేశంలో దక్షిణాదిన యమధర్మరాజు తీర్థయాత్రగా సంచరిస్తున్నప్పుడు ఓ పర్వతాన్ని తిలకించారు. ఆ పర్వతపు అందాలు యమధర్మ రాజునే మైమరపించింది.

ఆ తర్వాత తీర్థయాత్రను కొనసాగించలేని యమధర్మరాజు ఆ అందమైన పర్వతం పైనే పెరుమాళ్ కోసం ఘోర తపస్సు చేశారు. యముడి అపార భక్తికి ముగ్ధుడైన పరంధాముడు ప్రత్యక్షమయ్యాడు.

ఆ క్షేత్రంలో తనను కరుణించినట్లే, భూలోక ప్రజలను కూడా కరుణించాలని కోరుతూ దామోదరుడి నుండి వరం పొందిన కాలదేవుడు. పరలోకపు శిల్పి విశ్వకర్మను పిలిచి చంద్రుడి అందాలను తలపించేలా ఆ చోట... ఓ ఆలయాన్ని నిర్మించమని పురమాయించాడు.

విశ్వకర్మ తన శిల్పకళా చాతుర్యాన్ని చాటేలా నిర్మించిన ఆ ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేతుడై శ్రీవారు కొలువుదీరారు. వృషభపర్వతం అంటూ యమధర్మరాజు కీర్తించబడిన ఆ పర్వతం నేడు అళగర్మలై అని కీర్తింపబడుతోంది. ఆలయాన్ని అళగర్ కోవిల్ అని పిలువబడుతోంది.

ఆ ఆలయ రాజగోపురం తూర్పుదిశగా నిర్మితమై ఉన్నప్పటికీ దక్షిణ దిశగా ఉన్న వండి వాయిల్ ఆ ఆలయ ప్రవేశద్వారంగా ఉంటోంది.

ఆలయంలో ప్రవేశించగానే ప్రధాన లోగిలి, అందులో నిర్మితమైన మట్టి మండప స్తంభాలలో శ్రీకృష్ణుడు, త్రివిక్రముడు, గరుడవాహన మహావిష్ణువు, హిరణ్యవధ నరసింహుడు వంటి ఆకారాలు అద్భుతమైన శిలారూపాలుగా చూడవచ్చు.

అందమైన ద్వారపాలకులు కాపలా కాస్తున్న తొండైమాన్ గోపుర ప్రవేశద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశిస్తే స్వర్ణ రేకులతో తాపడం చేసిన ధ్వజస్తంభం, బలిపీఠం కనిపిస్తుంది.

ధ్వజస్తంభం తర్వాత గరుడ మండపం, దాని తర్వాత మహామండపం, దానిని దాటుకుని వెళితే లోపలి ప్రకారం. ఎదురుగా గర్భాలయం కనిపిస్తాయి. గర్భాలయంలో పరమస్వామి తూర్పు తిరుముఖ మండలం, నిల్చున్న భంగిమలో పాంచజన్యం అనే శంఖం, సుదర్శన చక్రం, ఖడ్గం, కొదండం అనే విల్లు, కాపాడే గద అంటూ పంచాయుధాలతో, శ్రీదేవి, భూదేవి సమేతుడై అద్భుతంగా దర్శనమిస్తారు. స్వామివారు. అంజేల్ అనే ఓ హస్తం అభయమిస్తుంది. మరో హస్తం ప్రయోగ చక్ర రూపాన్ని చూపుతుంది.

ఉత్సవమూర్తి అందానికి అందంగా సుందర రూపంలో సుందరరాజన్, కళ్ళలగర్, వెలకట్టలేని అపరంజి అనే బంగారంతో తయారైన అందమైన రూపం.

పరమస్వామివారిని, కళ్ళలగర్ను దర్శించిన నేత్రాలు మరేదీ చూడడానికి ఇష్టపడదు. మనస్సు సంతోషభరితమవుతుంది.

గర్భాలయం కుడివైపు ప్రత్యేక సన్నిధిలో కళ్యాణ సుందరవల్లి తాయారు కొలువుదీరి ఉన్నారు.



తాయారు సన్నిధి తర్వాత చక్రతాళ్వారుల సన్నిధి. త్రినేత్రాలతో, ద్వారా కేశంతో, ఆయుధాలు కలిగిన పదహారు చేతులతో, రౌద్ర స్వరూపిగా, నలభైనాలుగు గాయత్రీ మంత్రాలతో షట్కోణ యంత్రంలో ఆ స్వామిని దర్శించ గలం. ఈ ఆలయంలో తప్ప మరే ఆలయంలోనూ ఇలాంటి సుదర్శనా లను చూడ లేము. చక్రతాళ్వారుకు. పైన హిరణ్యకశిపుని వధిస్తున్న రూపంలో నరసింహస్వామి దర్శన మిస్తారు.

కళ్ళలగర్ సన్నిధికి పడమట ఉన్న యోగ నరసింహస్వామి వర ప్రసాది. జ్వాలా నరసింహుడిగా సేవలందుకుంటున్న ఈ స్వామివారి శిరస్సునుండి అగ్నిజ్వాలలు వెలువడుతుందన్న భావనతో పైకప్పులో పెద్ద రంధ్రం ఉంటుంది. ఈ స్వామివారి కోపాన్ని తగ్గించేందుకు తైలం, పెరుగు, పాలు, సుగంధ ద్రవ్యాలతో ప్రతిరోజూ తిరుమంజనం నిర్వహిస్తారు.

పార్థసారథి, అష్టభుజ కృష్ణుడు, నర్తన కృష్ణుడు, సరస్వతి, విశ్వక్సేనులు, ఆళ్వార్లు తదితరులకు ఆగమ విధుల ప్రకారం వేర్వేరు సన్నిధులు కూడా ఉన్నాయి.

పెరియాళ్వార్, ఆండాళ్, నమ్మాళ్వార్, భూదత్తాళ్వార్, పేయాళ్వార్, తిరుమంగైయాళ్వారు తదితరులు 128 నాలాయిర దివ్య ప్రబంధ కీర్తనలలో అళగర్ ఆలయం గురించి, పెరుమాళ్ వైభవం గురించి కీర్తించి పారవశ్యం చెందారు.



తన అంత్యకాలంలో పెరియాళ్వార్ ఈ క్షేత్రానికి విచ్చేసి అళగర్ అనుగ్రహం పొంది వైకుంఠ ప్రాప్తి పొంది అళగర్ పర్వతాన్ని తిరుమాలిరుంబోలై అని తన కీర్తనలలో పొగిడారు.

రామానుజులు కళ్ళలగర్ను దర్శించుకునేందుకు విచ్చేసినప్పుడు ఆండాళ్ తన పాశురాలలో పేర్కొన్న విధంగా వెయ్యి అండాలలో వెన్నను, అత్తిరసాలను అంగరు నైవేద్యంగా సమర్పించారు.

యేడాది పొడవునా ఆలయంలో ఉత్సవాలు జరుగుతుంటాయి. చిత్తిరై మాసంలో నిర్వహించే పౌర్ణమి ఉత్సవాలే కళ్ళలగర్ ఉత్సవాల్లోనే అత్యంత ప్రధానమైనది. ఈ ఉత్సవాలతోపాటు మదురై మీనాక్షి అమ్మవారి ఆలయ ఉత్సవాలను శైవ, వైష్ణవమతాల సామరస్యతను ఎలుగెత్తి చాటేలా తిరుమలై నాయకర్ సంయుక్తంగా నిర్వహించారు.

సోదరి అంగయరన్నికి సుందరేశ్వరులకు నిర్వహించే తిరుకళ్యాణం జరిపించేందుకు అళగర్ స్వామి పర్వతం మీద నుండి కిందకు దిగి మదురైకి వేంచేయడం విశేషం.

చైత్రపౌర్ణమి ఉత్సవాల సమయంలో బాణసంచా వేడుకలు, తప్పెట్ల మోతలు, మంగళవాయిద్యాలు, నృత్యాలు, వీధిభాగోతాలు నిర్వహిస్తుండగా పరివార సమేతులై అళగర్ మదురై నగరానికి వేంచేస్తారు. మార్గ మధ్యంలో అక్కడక్కడా పలు క్షేత్రాలలో, మండపాలలో స్వామివారు గౌరవ సత్కారాలను అందుకుంటారు.

ప్రతి రోజూ వివిధ రకాలైన రూపాలలో, వివిధ రకాలైన వాహనాలలో అళగర్ భక్తులకు దర్శనమిచ్చి వారిని అనుగ్రహిస్తారు. తొమ్మిది రోజులపాటు జరిగే ఆ వేడుకల్లో కళ్ళలగర్ వైగై నదిలో వేంచేయడం అత్యంత కీలకమైన ఉత్సవం.

ఆండాళ్ దేవి ధరించి ఇచ్చిన మాలను ధరించి, అశ్వారూఢుడై అళగర్ ఆ వాగులో దిగుతుండగా మదురై వాసులంతా ఎదురేగుతారు. ఈ వేడుకలను తిలకించేందుకు దేశవిదేశాల నుండి వేలాది నుంది భక్తులు తరలివస్తారు. ఆ రోజున వైగై నది భక్తజన సముద్రంగా మారుతుంది..

ప్రతియేటా పంగుణి ఉత్తరం రోజు ఆండాళ్ తిరుకళ్యాణ ఉత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది.

తనను ఆశ్రయించిన భక్తులందరికీ కళ్ళలగర్ సకల సౌభ్యాగాలను అందిస్తున్నారు.

## ఆలయ విశేషాలు

| | |
|---|---|
| స్థలం పేరు | : తిరుమాలిరుంజోలై, అళగర్ ఆలయం |
| స్వామివారి పేరు | : సుందరరాజన్, కళ్ళలగర్ |
| ఎక్కడ వుంది | : మదురైకి 20 కి.మీ.ల దూరంలో ఉంది. |
| ఎలా వెళ్ళాలి? | : చెన్నై నుండి రైలు, విమానం, కారులో మదురైకి వెళ్ళి అక్కడి నుండి 20 కి.మీ. దూరంలో ఉన్న అళగర్ ఆలయానికి కారులో, బస్సులో చేరుకోవచ్చు. |
| ఎక్కడ బస చేయాలి | : మదురైలో అన్ని సదుపాయాలున్న |
| దర్శన సమయం | : లాడ్జీలు, రెస్టారెంట్లు ఉన్నాయి. ఉదయం 8.30 నుండి మధ్యాహ్నం 1.30 వరకు, మధ్యాహ్నం 2.00 నుండి సాయంత్రం 5.30 వరకు. |



# శ్రీ చాగంటి వారికి గురజాడ విశిష్ట పురస్కార ప్రదానోత్సవం

శ్రీ గురజాడ అప్పారావు గారి వర్ధంతిని పురస్కరించుకొని విజయ నగరములోని గురజాడ సాంస్కృతిక సమాఖ్య వారు గురజాడ సాహితీ చైతన్యోత్సవములో భాగంగా తమ ఆధ్యాత్మిక ప్రవచనముల ద్వారా సమాజమును అభ్యుదయ పథములో నడిపిస్తున్న పూజ్య గురుదేవులు 'ప్రవచన సార్వభౌమ' 'వాచస్పతీ బ్రహ్మశ్రీ డా॥ చాగంటి కోటేశ్వర రావు గారిని "గురజాడ విశిష్ట పురస్కారము"తో సత్కరించారు. సమాఖ్య తరుపున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ శ్రీ కోలగట్ల వీరభద్ర స్వామి ఈ పురస్కార ప్రదానం చేసారు.

గురజాడ వారు ఆశించిన అభ్యుదయ సమాజము శ్రీ చాగంటి వారి వంటి మహనీయుల ప్రవచనముల వలననే సాధ్యమని, అటువంటి చాగంటి వారే ఈ పురస్కారమునకు పరిపూర్ణముగా అర్హులనీ సభలోని పెద్దలందరూ తమ హర్షమును వ్యక్తము చేసారు.

శ్రీ చాగంటి వారు తమ ప్రతిస్పందనలో ఈ పురస్కారమును గురజాడ వారి ఆశీర్వచనముగా అందుకొంటున్నాననీ, పురస్కారము పుచ్చుకునే సమయములో కూడా ఆ పురస్కారమును తలదాల్చి, గురజాడ వారి పాదములకు నమస్కరిస్తున్న భావనతో అందుకొన్నాని చెప్పి, తమ వినయమును చాటు కున్నారు. గురజాడ వారంటే ఆయనకున్న భక్తి, పూజ్య భావనను శ్రీ చాగంటి వారు గురజాడ వారి అనేక పద్యములను విశ్లేషిస్తూ, గురజాడ వారి భావ గాంభీర్యమును, రచనా సొబగునూ శ్లాఘిస్తూ సభకు తెలియజేసారు. ఈ సమాజములో ఎందరో గురజాడలు తయారు కావాలంటే అది గురజాడ వారి సాహితీ పరిశీలన వలననే సాధ్యమని వివరించిన శ్రీ చాగంటి వారు ఈ పురస్కారమునకు ఎంత అర్హులో వారి ప్రవచనమే తెలియజేసింది.

# పుణ్యం వెల

కాశీ పట్టణంలో ధనవంతుడు అయిన ఒక బ్రాహ్మణుడు వుండేవాడు. అతను ప్రతీ రోజు దాన ధర్మాలు చేసేవాడు. దానికి తోడు మిక్కిలి దైవ భక్తి కలవాడు మరియు యజ్ఞ యాగాదులు కూడ చేసేవాడు. ఒక యాగంలో అన్నీ దానం చేయటంతో కుటుంబ పోషణకు అతడి వద్ద డబ్బులు లేకుండా పోయాయి.

పక్క ఊరిలో ఒక పెద్ద వ్యాపారి నివసిస్తున్నాడని అతడు ఇతరుల పుణ్యంను కొని ధనం ఇస్తాడని బ్రాహ్మణుడి భార్య అతనికి చెప్పి వారి వద్దకు వెళ్లి మీ పుణ్యాలు అమ్మి కొంత డబ్బు తీసుకురండి, తద్వారా వ్యాపారం మళ్లీ ప్రారంభం చేయవచ్చును అని సలహా ఇస్తుంది. బ్రాహ్మణుడు మాత్రం తను చేసిన పుణ్యంఫలం అమ్మడానికి ఇష్టపడలేదు, కానీ భార్య ఒత్తిడి మరియు పిల్లల బాధల కారణంగా అతను పుణ్యంఫలం అమ్మడానికి సిద్ధ పడక తప్పలేదు.

దారిలో తినడానికి భార్య ఇచ్చిన నాలుగు రొట్టెలు తీసుకొని ప్రయాణం అవుతాడు. అతను నడుచుకుంటు అడవిలోనుండి పోయేవేళ ఆకలి కావటంతో ఊరికి చేరేలోపు భోజనం ముగించాలి అనుకుని రొట్టె తీయగానే ఒక కుక్క వచ్చి తన మూడు కుక్కపిల్లలతో ఎదుట నిలబడుతుంది. పిల్లలు చాలా చిన్నవి కావడంతో వాటిని వదిలి ఊరులోకి వెళ్లలేకపోయినట్టుంది. దానిని అలా చూడగానే బ్రాహ్మణునికి బాధగా అనిపించి అతను కుక్కపై కుక్కపిల్లల కోసం జాలిపడి, తన దగ్గర ఉన్న రొట్టెల నుండి ఒక రొట్టెను కుక్కకు ఇస్తాడు. కుక్క చాలా రోజులుగా ఆకలితో ఉండటంతో, కుక్క త్వరగా రొట్టె తినేసింది, కానీ ఇంకా ఆకలితో ఉండటంతో బ్రాహ్మణుడి వైపు చూడసాగింది. బ్రాహ్మణుడు జాలిపడి రెండవది, తరువాత మూడవది, చివరి నాల్గవది అలా మొత్తం రొట్టెలు కుక్కకు వేసి తను మాత్రం కేవలం నీరు త్రాగి వ్యాపారి ఉన్న వూరికి చేరుకొంటాడు.

బ్రాహ్మణుడు వ్యాపారితో తన పుణ్యాన్ని అమ్ముకోవడానికి వచ్చానని చెప్పుతాడు.

అప్పుడు వ్యాపారి నేను పనిలో ఉన్నాను, సాయంత్రం రండి, నేను మీ పుణ్యఫలం కొంటాను అని అంటాడు.

మధ్యాహ్నం వ్యాపారి ఇంటికి భోజనానికి వెళ్లి తన పుణ్యాన్ని విక్రయించడానికి ఒక బ్రాహ్మణుడు వచ్చాడని భార్యతో చెబుతాడు. అతని దగ్గర నేను ఏ పుణ్యం కొనాలి చెప్పు అని సలహా అడుగుతాడు.

వ్యాపారి భార్య చాలా గొప్ప పతివ్రత స్త్రీ. ఈరోజు బ్రాహ్మణుడు రొట్టెలన్నీ కుక్కకు ఇచ్చి చాలా పుణ్యం సంపాదించుకున్నాడని కండ్లు మూసుకొని ధ్యానం చేసి తెలుసుకొంటుంది. కుక్కలకు రొట్టెలు వేసి సంపాదించిన పుణ్యంను బ్రాహ్మణుడి నుండి కొనమని తన భర్తకు చెబుతుంది. సాయంత్రం బ్రాహ్మణుడు తన పుణ్యాన్ని విక్రయించడానికి వచ్చినపుడు వ్యాపారి ఇలా అంటాడు.

ఈరోజు నువ్వు చేసిన యజ్ఞం యొక్క పుణ్యాన్ని నేను కొనాలని అనుకొంటున్నాను. దానికి బ్రాహ్మణుడు నవ్వి ఇలా అంటాడు. నా దగ్గర యజ్ఞానికి సరిపడ ధనం ఉంటే నీకు పుణ్యం అమ్మడానికి వచ్చేవాడినా అని.

మీరు ఈరోజు ఆకలితో ఉన్న కుక్కకు ఆహారం పెట్టి ఆ కుక్కను, దాని పిల్లలను నువ్వు రక్షించావు అదే యజ్ఞం అని వ్యాపారి అంటాడు.

నువ్వు సంపాదించిన ఆ పుణ్యాలన్నీ నేను కొనాలని అనుకొంటున్నాను అని అంటాడు. బ్రాహ్మణుడు పుణ్యం అమ్మడానికి అంగీకరిస్తాడు.

దానికి బదులుగా నీకు నాలుగు రొట్టెల బరువుకు సమానంగా వజ్రాలు, ముత్యాలు ఇస్తానని వ్యాపారి అనటం దానికి బ్రాహ్మణుడు కూడ అంగీకరించడం జరిగిపోతాయి. నాలుగు రొట్టెలు తయారు చేసి త్రాసులో కాటాకు ఒక ప్రక్కన ఉంచబడతాయి. రెండవ దానిలో, వ్యాపారి ఒక సంచీ నిండా వజ్రాలు, ముత్యాలు మరియు ఆభరణాలు ఉంచుతాడు.

త్రాసు యొక్క కాటా కొంచెం కూడ కదలదు.

రెండవ సంచీ ఉంచిన కూడ కాటా కొంచెంకూడ కదలక పోయేసరికి వ్యాపారి తన దగ్గర వున్న ఆభరణాలు అన్నీ రెండో దిక్కున వుంచినా కూడ కాటా అసలుకే కదలదు. అది చూసిన తర్వాత అక్కడ వున్న వారందరు ఆశ్చర్యపోతారు.

అప్పుడు బ్రాహ్మణుడు వ్యాపారితో, 'నేను నా మనసు మార్చుకున్నాను'. ఇప్పుడు నా పుణ్యాన్ని నీకు అమ్మడం నాకు ఇష్టం లేదు అని రిక్త హస్తాలతో తన ఇంటికి ప్రయాణం అవుతాడు.

ఇంట్లోకి అడుగు పెట్టగానే భార్య తనతో గొడవ పడుతుందేమోనని భయపడి, దారిలో కుక్కకి రొట్టెలు ఇచ్చిన చోటు నుంచి కొన్ని గులకరాళ్లు, బండలను ఏరుకుని దానితో ఒక మూటనూ తయారుచేసి ముడి వేస్తాడు. ఇంటికి చేరుకోగానే అతని భార్య పుణ్యాన్ని అమ్మి ఎంత సంపాదించావు అని అడుగటంతో ఆ రాళ్ల మూటను భార్యకు ఇచ్చి అప్పు దొరుకుతుందేమోనని గ్రామం లోకి వెళ్ళుతాడు.

ఇక్కడ అతని భార్య ఆ మూటను చూసి ఆగలేక, భర్త వెళ్లగానే ఆ మూట తెరిచి చూస్తుంది. ఆ మూట నిండా వజ్రాలు, నగలు ఉండటం తో ఆమె సంతోషానికి అవధులు లేకుండా పోతాయి.

బ్రాహ్మణుడు ఇంటికి తిరిగి రాగానే అతని భార్య మీ పుణ్యానికి ఇంత మంచి ధర ఎవరు చెల్లించారని అడుగుతుంది. మీకు ఇన్ని వజ్రాలు మరియు ఆభరణాలు ఎక్కడ నుండి వచ్చాయి. దానికి ఆశ్చర్య పోయిన బ్రాహ్మణుడు వజ్రాలు, నగలా ఎక్కడ ఉన్నాయో చూపించు అని అంటాడు భార్యతో

భార్య తన ముందు ఉన్న మూటను విప్పగానే అందులోంచి విలువైన ఆభరణాలు బయటపడటంతో బ్రాహ్మణుడు కూడా ఆశ్చర్యపోతాడు.

అప్పుడు అతను తన భార్యకు జరిగిన విషయాలు అన్నీ పూస గుచ్చినటుల చెబుతాడు. విపత్తు సమయంలో తన పుణ్యమును విక్రయించమని అతనిని బలవంతం చేసినందుకు అతని భార్య చాలా బాధపడుతుంది.

ఇదీ కథ.

నిజానికి ఇది కథ కాదు. జీవితం. ఈ కలిలో, ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టండి. ఆపదలో ఉన్న వారికి సాయం చెయ్యండి. మీకు ఎంత డబ్బున్నా ఇహలోక ప్రయాణానికే. మీ డబ్బును ఎవరైనా దొంగిలించవచ్చు. కానీ, మీ పుణ్యాన్ని ఎవరూ దొంగిలించలేరు. అందుకే, మీ దగ్గర ఉన్న డబ్బును పుణ్యంగా మార్చుకోండి. పరలోక ప్రయాణానికి ఆ పుణ్యం తోనే టిక్కెట్టు కొనుక్కోండి.

దేవుడు మనల్ని పరీక్షిస్తాడు, మనం ఆ పరీక్షలో ఉత్తీర్ణులైతే, మనల్ని శాశ్వతంగా ఆశీర్వదిస్తాడు

అందుకే ఎంతటి సంక్షోభం వచ్చినా భగవంతునిపై విశ్వాసం వమ్ముకాకూడదు.

ప్రపంచానికి భయపడకు. ఇక్కడ ఎవరో కోరితే ఎవరికీ చెడు జరగదు. మన కర్మ ఫలమే మనకు లభిస్తుంది,

ఆ దేవుడినే నమ్ముకోండి. ఎందుకంటే అంతా ఆయన ఆధీనంలోనే జరుగుతుంది. ●

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని -
చెన్నై



# గానమే ప్రాణమైన ఘంటసాల

భూమిమీద వృథాగా నూరేళ్ళు బ్రతకడం కంటే, జీవించింది కొద్ది కాలమైనా పురుషార్థపరుడై బ్రతకాలని సుమతీ శతకకారుడు చెప్పాడు. అలా గాయక లోకంలో సుప్రతిష్టతో జీవించిన మాన్యులలో ప్రఖ్యాత గాయకోత్తముడు కీ.శే. ఘంటసాల వేంకటేశ్వరరావు. ప్రజా బాహుళ్యం హృదయాలలో నిక్షిప్తమైన పేరు "ఘంటసాల". "ఘృతమాధార పాత్రయా? పాత్రమాధార ఘృతయా"? అన్నట్లు చలనచిత్రాలలో పాడడం వల్ల ఆయనకి పేరొచ్చిందా, ఆయన పాడడంవల్ల ఆనాటి చలనచిత్ర సంగీతానికి పేరొచ్చిందా అన్న సందేహాలకు అన్యోన్యాశ్రయం వల్ల అని జవాబు లభించినా, నేనుమాత్రం ఆయన పాటవల్లే, ఆనాటి సినిమా సంగీతం ఈనాటికీ శ్రోతకు ఆనందహేతువుగా నిలచిందని నేను భావిస్తాను. ఘంటసాల తరువాత అంతగా ప్రసిద్ధి పొందిన బాలసుబ్రహ్మణ్యానికి సమర్థులైన సహగాయకుల పోటీ లేదు. కానీ ఘంటసాల కాలంలో, మాధవపెద్ది సత్యం, పిఠాపురం నాగేశ్వరరావులు కూడా ప్రసిద్ధులే. ఎవరిగళానికి నప్పిన పాటలను వారి వారి ఆకర్షణీయమైన శైలిలో గానంచేశారు. చలనచిత్ర పరిశ్రమలో గాయక త్రిమూర్తులుగా వాళ్ళు ముగ్గురు రాజిల్లారు. కానీ ఘంటసాల గళానికి భగవంతుడు ప్రసాదించిన మెళకువలు ఇటు నాయకీ నాయకుల యుగళ గీతాలలో అటు లలిత శాస్త్రీయ సంగీతాలలో, ఇలా అన్ని రకాలలో నవరస ప్రాధాన్యమై ఆయన ఏరకమైన పాటైనా పాడగలరనే విశ్వాసానికి పునాది వేసి, ఘంటసాల ప్రతిభ మరింతగా విరాజిల్లింది. ఘంటసాల "సుందరినీవంటి దివ్యస్వరూపంబు" అని హాస్య పంథాలో పాడినా "రసికరాజ తగువారము కామా" అని శాస్త్రీయ పంథాలో గానంచేసినా, గంభీర గళాలతో పోటానుపోటీగా పద్యాలు పలికించినా మొక్కవోని ఘంటసాల గళ మాధుర్యం అనిర్వచనీయంగా సాగేది. ఆనాటి దిగ్గంతుల రచనా సౌందర్యానికి ఘంటసాల గాత్రం అందించిన సౌరభాలు ఆపాటలను అజరామరంచేశాయి. భక్తి, ఆర్ద్రత, లాలిత్య, గాంభీర్య, పటుత్వాలు రంగరించి ఆస్వాదించిన ఘంటసాల గళంలో పాట శ్రోతల కొక నవనవోన్మేష అనుభూతి. చలనచిత్ర రంగానికి ఆయనపాట ఓ నిఘంటువు.

ఘంటసాల జన్మించి నూరేళ్ళయింది. 1922 వ సంవత్సరం డిసెంబరు 4 వ తేదీన, ఆంధ్రదేశ కృష్ణాజిల్లా చౌటుప్పల కుగ్రామంలో జన్మించారు. నూరేళ్ళు గడిచినా గానలోక స్మృతి పథంనుంచి ఆయన తొలగి పోలేదు. సంగీతంపైన, పాటపైన ఆయనకున్న అపార విశ్వాస ఫలితం నిలువెత్తు దర్పణమై నేటికీ నిలచి వుంది.

ఘంటసాల జన్మించింది ఒక సామాన్య బీద సంగీత కుటుంబంలో. తండ్రి సూరయ్యగారు మృదంగ విద్వాంసులు. భగవత్ సంకీర్తనా కార్యక్రమాలకు మృదంగానుసరణతో ఆర్జించే కొద్ది పైకంతోనే కుటుంబ పోషణ చేయాలి. అలా అలా గడుస్తున్న కాలంలో తండ్రిగారి హఠాన్మరణం చిన్న ఘంటసాల పై ఓఅశనిపాతం. ఆసమయంలో దైవం మానుషరూపేణా అని తరంగగానంలో సుప్రసిద్ధులైన ఘంటసాల మేనమామ చిట్టా సూర్యనారాయణగారు ఘంటసాలకు కాసింత వెన్నుదన్నుగా నిలచారు. పరిస్థితుల ప్రభావం ఎలావున్నా, సంగీతంపై ఆయనకున్న, మక్కువ మాసిపోలేదు కదా ఆ తపన మరింత ద్విగుణీకృతమయింది. ఫలితంగా ఎవరికీ చెప్పకుండా వ్రేలికున్న బంగారు వుంగరాన్ని అమ్మేసి సంగీతాది కళలకు నెలవైన విజయనగరం చేరారు. అక్కడ సంగీతకళాశాల ప్రధానోపాధ్యాయులైన వాయులీన విద్వాంసులు ద్వారం వేంకటస్వామి నాయుడి గారి ప్రోత్సాహంతో సంగీత కళాశాలలో చేరారు. ఇక తిండికి మధూకరం, పడకకి ఆలయ ప్రాంగణం అలా సత్రా భోజనం మఠా నిద్రగా కొనసాగిస్తూ, శ్రీ పట్రాయని సీతా రామశాస్త్రిగారి శుశ్రూషలో గాత్రసంగీతాభ్యాసంచేసి, కొంత మేరకు సాధించి ప్రదర్శనా స్థాయికిచేరిన ఘంటసాల. తొలి దీవనగా హరికథా పితామహులైన పుంభావ సరస్వతి శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణ దాసుగారి నుంచి ఒక తంబురాను బహుమతిగా పొందారు. గురు దీవెనలు, పెద్దల ఆశీస్సులు ఘంటసాలను సంగీత రంగంలో సుస్థిరం చేశాయి. కానీ కేవలం పాటతో బ్రతకడం కష్టమైన దశలో ఉదర పోషణార్థం బహు కృతవేషం అన్నట్టుగా, ఆయన దిశ హరికథలవైపు, నాటకాలవైపు మళ్ళింది. అలా హరికథాగానాలు ఆనాటి ప్రసిద్ధ రంగస్థల నటులు పారుపల్లి సుబ్బారావు, పారుపల్లి సత్య నారాయణ, అద్దంకి శ్రీరామమూర్తి, పులిపాటి, రఘురామయ్య లాటి వారితో కొన్ని నాటకాలు. అలాగడుస్తున్న నేపథ్యంలో పెదపులిపర్రు గ్రామంలోని వధువు సావిత్రమ్మతో వివాహం. అటుపై వివాహానంతరం ఘంటసాల జీవితంలో మరో పెద్ద మలుపు. అప్పటికే చలనచిత్ర గీతరచయితగా ప్రఖ్యాతులైన సముద్రాల రాఘవాచార్యులు, ఘంటసాల అత్తవారింట ఆయన పాటవిని, ఆ గాత్ర గరిమకు మురిసి, ఘంటసాల మనసును మద్రాసు చలనచిత్రరంగంపైకి మళ్ళించారు. అంతేగాక ఇతోధికంగా వెన్నుదన్నై నిలచారు. సినిమారంగం కదా ఎన్నో అడ్డంకులు. ఒకరు కాదంటే పదిమంది వద్దనడం మానవ నైజంగా రికార్డింగ్‌కి కూడా పనికిరాదంటూ ఘంటసాల గళం తిరస్కారానికి గురైంది. కొంతకాలానికి అదే సంస్థ ఆయనను భుజాలపైకి ఎత్తుకుందన్నది వేరే విషయం.

ఏది ఏమైనా చేపట్టిన సంకల్పం నుంచి వెనుదిరగడం ఘంటసాల మస్తిష్కంలో లేకపోవడంవల్ల చెన్నైలోనే కొన్ని శాస్త్రీయంలో కొన్ని లలితసంగీతంలో కచేరీలు చేయడం, ఆకాశవాణిలో పాటలు పద్యాలు పాడుతూ కాలం వెళ్ళదీస్తున్న సమయంలో ఆనాడు చెన్నై ఆకాశవాణి సంగీతప్రయోక్త బాలాంత్రపు రజనీకాంత రావుగారు తన సంగీత దర్శకత్వంలో నిర్మించిన "స్వర్గ సీమ " చిత్రంలో గాయకుడిగా అవకాశం కలిపించారు. ఆపైన "రత్నమాల" "లైలామజ్ను" ఇత్యాది చిత్రాలలో తెరపైన నేపథ్య గాయకునిగా ఘంటసాల వేంకటేశ్వరరావు పేరు కనించింది. అలా కనిపించిన ఆ పేరు ఇంతకు ఇంతై వటుడింతై అన్నట్లుగా, ఎన్నెన్నో అద్భుతమైన పాటలకు ఆయన గళం నెలవైంది. ఆయన పాడిన ప్రతి పాటా సినీ సంగీత ప్రియులను ఉర్రూతలూపింది. గాయకునిగా ఆయన పేరు వెండితెరపై సువర్ణాక్షర లిఖితమయింది.

ఇక మరోవైపు ఘంటసాల గళం పలికిన జంధ్యాల పాపయ్య శాస్త్రిగారి "పుష్ప, కుంతీ విలాపాలు, ఆరోగ్యం సరిగ్గా లేని చివరి దశలో గానంచేసిన భగవద్గీత యావత్ ప్రపంచంలో ఆయన పేరును అజరామరం చేశాయి. ఆయన చలన చిత్ర నేపద్యగాయకుడైనా, ఆయన పేరును విజయవాడలోని సశాస్త్రీయ సంగీత కళాశాలకు పెట్టడం, అటు ప్రభుత్వం ఇటు ప్రజానీకం ఘంటసాల పట్ల కనుబరిచిన అపారగౌరవచిహ్నా సత్యం.

నాటినుంచి నేటిదాకా వేలాది మంది గాయకులకు ఆరాధ్యుడైన ఘంటసాల మరణం కేవలం భౌతికం మాత్రమే. ఆయన గళగాన ప్రాణం మాత్రం సుస్థిరం. కేవలం 48 సంవత్సరాల జీవన గమనంలో, ఆయన పాట మూడు దశాబ్దాల చలన చిత్ర సంగీత స్వర్ణయుగ భాసితం. "బాబూ" అంటూ అందరినీ ఆప్యాయతగా పిలిచే ఆయన మాటలోని ఆర్ద్రత చవి చూచిన నాబోంట్లకు చిరస్మరణీయం.

– పారుపల్లి శ్రీరామచంద్రమూర్తి



# సి.వి. రామన్ జయంతి

భారతదేశం గర్వించదగిన శాస్త్రవేత్తలలో అగ్రగణ్యుడు మన దేశం నుంచి మొట్ట మొదటిసారిగా నోబెల్ బహుమానం పొందిన శాస్త్రజ్ఞుడు అదేవిధంగా మన దేశం నుంచి నోబెల్ బహుమానం పొందిన రెండవ మనిషిగా సివి రామన్ అందరికీ తెలిసిన విషయమే, సివి రామన్ 1888 సంవత్సరం నవంబర్ 7వ తారీకు తిరుచిరాపల్లిలో ఒక సాధారణ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు చంద్రశేఖర్ అయ్యర్ తల్లి పార్వతి అమ్మాల్ తండ్రి మ్యాథమెటిక్స్ మరియు ఫిజిక్స్ బోధించే అధ్యాపకుడు తల్లి మ్యూజిక్ టీచర్, తండ్రి విశాఖపట్నం AVN కాలేజీలో ఉద్యోగం చేయటం వలన హై స్కూల్ విద్య విశాఖపట్నంలో జరిగింది తర్వాత మద్రాస్ ప్రెసి డెన్సి కాలేజీలో బిఏ మరియు ఎంఏ ఫిజిక్స్ తో పూర్తి చేశారు తర్వాత ఐ సి ఎస్ కు సెలెక్ట్ అయి కలకత్తాలో ఉద్యోగంలో చేరారు కొంతకాలం ఈ ఉద్యోగం చేస్తూ ఈ ఉద్యోగంలో తృప్తి చెందక ఫిజిక్స్ పరిశోధన మీద ఇష్టంతో అంత గొప్ప ఉద్యోగాన్ని మానేసి పరిశోధన చేశారు.

ఈయన కేవలం 200 రూపాయలు ఖరీదైన పరికరాలను మాత్రమే ఉపయోగించి పరిశోధన కావించారు ఈయన చేసిన పరిశోధనాన్ని రామన్ ఎఫెక్ట్ అని పిలుస్తారు దీనికి నోబెల్ బహుమానం కూడా వచ్చింది. ఈయనకు భారత ప్రభుత్వం భారతరత్న అనే బిరుదుతో సత్కరించింది.

రామన్ ఎఫెక్ట్ అనగా ఒక మోనోక్రోమాటిక్ కిరణాన్ని వాయు లేదా ద్రవ లేదా ఘనపదార్థముల మీదుగా పంపినప్పుడు ఆ పదార్థాలలోనున్న అణువుల మీద పడినప్పుడు దాని నుంచి కాంతి బయటకు వచ్చినప్పుడు స్కేటర్ లేదా విచలనము చెందుతుంది దీనినే రామన్ ఎఫెక్ట్ అంటారు.

కాంతి ఈ విధంగా స్కేటర్ కావటం వలననే మేఘాలు నీలిరంగులు అదేవిధంగా సముద్రపు నీరు నీలిరంగులో ఉంటాయి అని వివరించారు.

ఈ రామన్ ఫలితం వలన అనేక రకాల ఉపయోగాలు ముఖ్యంగా రసాయన శాస్త్రమును ఉన్నాయి ఇందులో ముఖ్యమైనవి. 1. హోమో న్యూక్లియర్ అణువుల యొక్క ఎనాలసిస్ చేయటానికి ఉపయోగపడుతుంది.

2. ట్రై అటామిక్ మాలిక్యుల్స్ అయినా సల్ఫర్ డయాక్సైడ్ కార్బన్ డయాక్సైడ్ వాటర్ లాంటి నిర్మాణాలను తెలుసుకొనటానికి ఉపయోగపడుతుంది.

3. ఎలక్ట్రోలైటిక్ థిస్ అసోసియేషన్ అదే విధంగా డిగ్రీ ఆఫ్ ఐనైజేషన్ అనే దుర్గి విషయాన్ని వివిధ రకాలైన ఎలక్ట్రానిట్లో ఎంత ఉంటుంది అనే విషయాన్ని ఈ రోమన్ ఎఫెక్ట్ ద్వారా తెలుసుకొనవచ్చు.

4. పరమాణువుల మధ్య ఏ విధమైన ఆకర్షణ ఉంటుంది అదేవిధంగా అణువుల మధ్య ఏ విధమైన ఆకర్షణ ఉంటుంది స్పటికాలు ఏర్పడేటప్పుడు పరమాణువులు లేదా అయానులు లేదా అణువులు ఏ విధంగా ప్యాకింగ్ చేయబడతాయి అనే విషయాలను పూర్తిగా తెలుసుకొనవచ్చు.

5. అణువుల యొక్క ఆకృతిని లేదా జామితిని ఈ రామన్ ఎఫెక్ట్ లేదా స్పెక్ట్రోస్కోపీ ద్వారా తెలుసుకొనవచ్చు ఉదాహరణకు డైపోరేన్ అణువు లో ఎన్ని బోరాన్ పరమాణువులు అదేవిధంగా ఎన్ని హైడ్రోజన్ పరమాణువులు ఉంటాయి. ఏ విధంగా అమరి ఉంటాయి వాటి మధ్య దూరం ఎంత అనే విషయాలను పూర్తిగా తెలుసుకొనవచ్చు.

ఈ రామన్ స్పెక్ట్రమ్ లేదా రామన్ ఎఫెక్ట్ వలన రసాయన శాస్త్రంలో అనేక విషయాలను పరిశోధించటానికి ఎంతో ఉపయోగకరంగా ఉంది దీనికి సి వి రామన్ గారికి ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ బహుమానం వచ్చింది వీరి మేనల్లుడైన సుబ్రహ్మణ్య చంద్రశేఖర్ అని కూడా ఫిజిక్స్లో నోబెల్ బహుమానం వచ్చింది ఒకే కుటుంబంలో రెండు నోబెల్ బహుమానంలు రావడం చాలా గొప్ప విషయం

భారతదేశంలో గర్వించదగిన శాస్త్రజ్ఞులలో అగ్రగణ్యుడు మన సివి రామన్ గారు. ●


## ప్రముఖాంధ్ర అభిమానులకు ఆహ్వానం, అభ్యర్థన!

ప్రముఖాంధ్ర గత **28** సంవత్సరాలుగా నిరాటంకంగా వస్తూనే వుంది. ఎందరో అభిమానులు ఏ పరిమాణంలో సహాయం అందించాలని ఫోన్లు చేస్తున్నారు? 'వేలు'గా ఇవ్వ అవకాశం లేని అభిమానులున్నామంటున్నారు.

అలాటి మహోదయులకు, మహా హృదయులకూ పరిమితి లేదు, పరిధి లేదు. మీ శక్తికి తగినట్లు, మీ మనసుకు తోచినట్లు సహాయ సహకారము లందచేయండి! ప్రతా ఒక్క నీటిబొట్టూ కూడితేనే ప్రవాహమవుతుందీ, జీవనదీ అవుతోంది. చేరిన ప్రతీ నీటిబొట్టునూ దాచుకొని సాగరం తిరిగి మేఘమై, మేఘం వర్షమై చినుకు చినుకుగా భువినెలా సస్యశ్యామల కోమలం చేస్తూ పంటలను పండిస్తూందో – మేమూ అలానే మీ ప్రతీ 'రూక'నూ ప్రముఖాంధ్రుల భాషా సేవకే వినియోగిస్తాం. 'ప్రముఖాంధ్ర'ను పంట పొలంగా చేసి, తెలుగు అక్షర విత్తులను పండిస్తాం. ఇదే మా వినతి! ఇదే మా అభ్యర్థన. ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం. పోస్టు ద్వారా ఉత్తరాలు వ్రాసి ఉన్న డబ్బులను కూడా హరింపచేయలేం. గ్రహించండి.

**రూ. 1001, 2001, 5001, 10,001, 25,001, 50,001 మీ ఇష్టం ఎంతైనా**

ప్రముఖాంధ్ర బ్యాంక్ వివరాలు :

| | | |
|---|---|---|
| Account Name | : | **PRAMUKHANDHRA** |
| Account No | : | **20011102592** |
| Bank | : | **BANK OF MAHARASTRA, T.NAGAR** |
| IFSC Code | : | **MAHB 0000450** |

**ప్రముఖాంధ్ర**

**64, తంబయ్యరెడ్డి వీధి, వెస్ట్మాంబళం, చెన్నై – 33.**

**మొబైల్ : 98400 48941**

# జాత్యాహంకారం వీడండి! జన సమ్మైక్యతకు బాటలు వేయండి!

ఆది అంతములు లేనిది, అమేయమైనది, అద్వితీయ ప్రతిభా సమన్వితమైనది, సర్వశక్తికరమైనది, శుద్ధమైనది, సుసంపన్న మైనదీ, సత్య, శాన్త, సుమంగళకరమైనదీ జ్ఞానం. ఆ జ్ఞానాన్ని అహంకార రహితంగా, అందరూ అధ్యయనం చేసి, అహంకార మును బాపుకుని, బ్రహ్మజ్ఞానం పొందేవారు. బ్రహ్మజ్ఞానులుగ విలసిల్లేవారు. అప్పుడు జ్ఞానమమకారం తప్ప, జాత్యహంకారం ఉండేది కాదు.

ఇది భారతదేశ పూర్వపు సనాతన ధర్మచరిత. చర్మమునకూ, మాంసమునకూ, ఎముకలకూ, రక్తమునకూ జాతీయనెడిది ఉండెడిదికాదు. అవిద్య, విద్య, అజ్ఞానం, విజ్ఞానం అనెడు లోపా లోపములన్నిటినీ, వర్ణాశమ ధర్మయుగ పరిష్కరించి, ఒకరి కొకరు మంగళ, అమంగళకర విషయములందు తోడయ్యేట్టుండగలరని ఊహించారు.

భవిష్యత్తులో సంభవించే యాంత్రిక జీవనంలో ఒకరి కొకరికి పొసగకుండా, హృదయం విప్పి మాట్లాడుకోకుండా ఉండే ప్రమాదం రాగలదని పూర్వులు ముందే ఊహించినట్టు తోస్తున్నది.

యాంత్రిక యుగంలో మనిషికి ప్రశాంతత కరువవు తుందనీ, జాత్యహం కారం, కులద్వేషమై (కులమనే క్రొత్త పేరు వర్ణధర్మానికి కలిగి) కులాల మధ్య అగాధమూ పెరిగిపోతుందనీ, ఆధ్యాత్మిక చింతన, హృదయంలో పరమాత్మకు స్థానమనేది ఉండదనీ, దైవమనిననూ, ధర్మమనిననూ ద్వేషం పెరుగుతుందనీ వారానాడే భావించి, వర్ణాశ్రమ ధర్మానికీ, గ్రామపాలనకూ అవకాశం కల్పించారు.

కులం, మతం, ప్రాంతం అనే పదాలకు తావు లేకుండా, సర్వహితైషకరమగు, సర్వభూతదయను ప్రవేశపెట్టారు. గడ్డి పరకనుంచీ బ్రహ్మము వరకూ సర్వమూ నందూ సర్వేశ్వరుడున్నాడనే తత్వాన్ని బోధించారు. పిపీలికాది బ్రహ్మ పర్యంతమూ అన్న నానుడి ఈ కారణంగానే పుట్టింది. అగ్ర అధమ జాతులనెడివి సృష్టిలో లేవు. సుర అసురులు మాత్రమే ఉండే వారనీ అధర్మగుణపరులైన అసురులు ఎంతటి వారైనా అంతరిస్తారనెడి విషయాన్ని చారిత్రక ప్రమాణికపరంగా రూఢి చేశారు. అధర్మాసుర బుద్ధితో, ధర్మ ద్వేషంతో వేదాలను, భూమినీ చుట్టుచుట్టి సముద్రంలో కలిపిన అసురులను పరమాత్మ అసురసంహారం కావించి వెలికితీసిన నిజం విదితమే!

కానీ ఇప్పుడు కొందరు పెద్ద సైజు పదవిగల ప్రజా నాయకులు ధర్మశాస్త్రా లనూ, అగ్రజాతులనూ (అగ్రజాతులంటే నాకేంవిటో అర్థం కాలేదు) సముద్రంలో త్రొక్కి పడేయ్యాలంటు న్నారు. ఈ సందర్భంగా నాకు అల్పబుద్ధివానికధికారమిచ్చినా దొడ్డవారినెల్ల తొలగగొట్టునన్న వేమన పద్యం స్ఫురించింది.

పూర్వపు పెద్దలు అందరినీ సమపథంలోనే నడపాలనీ, సన్మార్గపరులుగా, బ్రహ్మజ్ఞానధనులుగా విలసిల్లింపచేయాలని, వేదబ్రహ్మ జ్ఞానాన్ని, విశ్వవిస్తరణం చేశారు. అందరినీ బ్రహ్మజ్ఞాన పరులైన బ్రాహ్మణులుగానే తీర్చిదిద్దారు. సర్వ ప్రాణుల్లోనూ సర్వేశ్వరుడైన పరమాత్ముడున్నాడన్నారు. ఈశ్వర స్సర్వభూతానాం అంటూ అందర్నీ జ్ఞానమెరిగిన జ్ఞాన స్వరూపిల్ని కావించారు.

**ప్రాణం వాపి పరిత్యజ్య మానమే వాభి రక్షతు**
**అనిత్యో భవతి ప్రాణో మానమా చంద్ర**

– ఆత్మాభిమానం కలది ప్రాణియనీ, జీవ సంరక్షణమే ఆత్మధనమనీ, దానిని విడనాడి ఏ జీవమూ మనలేదనీ, సకల చరాచరజీవులూ బుద్ధజీవులేనంటూ నర, వానర, చర, అచర, విహంగ, పద, ద్విపద, చతుర్పాద జీవులన్నిటి అవసరం మనిషికున్నదంటూ రామాయణ రస కావ్యం ద్వారా తెలియచేసినవాడు, బోయవాడైన వాల్మీకి వరేణ్యుడు. ఆయన సకల చరాచరానికీ, ఒకరితో నొకరికి సంబంధం ఉందంటూ రామకథలో అనేక జీవుల్ని తీసుకున్నాడు. పరస్పరమైత్రీ సహకారాలతో బాటు, విశ్వ కుటుంబ వ్యవస్థకు గల అవసరాన్నీ, కుటుంబంలోని వివిధ ప్రాంతాల మధ్య బంధు బంధన గౌరవాన్ని తెలియచేశాడు. బుద్ధ జీవిగాని జ్ఞాని, శక్తిమంతుడైననూ, ధర్మబద్ధుడు కాడనీ ఎలాటి దురవస్థల పాలవుతాడన్నది రావణ, వాలి పాత్రల ద్వారా ధృవీకరించాడు. భరత, లక్ష్మణ, శత్రుఘ్న పాత్రలద్వారా భాతృ వాత్సల్యాన్నీ, రామ పాత్ర ద్వారా పితృ, మాతృ, భాతృ, గురు, హిత, స్నేహిత, భక్తుల పట్ల వాత్సల్యానురాగతనూ వివరిస్తూ, రామరాజ్య పాలన ఔన్నత్యమేం విటో విశ్లేషించాడాయన.

**జన్మతః ముస్లిము అయినప్పటికినీ రామభక్తి పరుడైన కబీర్ మహనీయుడు. ‘హంసాపాయే మానస సరోవరే తాల్ తలయ్యా, క్యోందోలే’** అంటాడు.

హంసకు మానసరోవరం లభించిననాడు మురికి గుం టలు వెంటబడుతుందా – అంటాడు. అందలి అర్థం గ్రహించి, ఆర్ష ధర్మాన్ని గ్రహింపకల్గిననాడు, ఇన్ని అనర్థాల పాలయ్యే వారము కాము. ఇంతటి అసురత్వం దేశంలో విజృంభించి విలయతాండవం చేసేది కాదు.


రాముడు అగ్రజాతివాణ్ణి అనుకుని ఉంటే, అడవుల్లోని శబరి ఇంటికేగి, దర్శనమిచ్చి, ఆమె రుచి చూచి యిచ్చిన ఎంగిలి పండ్లను భుజించేవాడు కాదు. నావను నడిపే గుహుణ్ణి స్నేహితునిగా భావించేవాడు కాదు.

అస్పృశ్యులని కొందరు వేరుచేసినవారిని, మహాత్మాగాంధీ, ప్రకాశం పంతులు గారు, పొట్టి శ్రీరాములు గారు, అనంత శయనం అయ్యంగార్ హరిజనులుగా అక్కున చేర్చుకున్నారు. కానీ ఈనాడెందుకో, మన కళ్లను మనమే పొడుచుకుంటూ, అగ్రజాతి వారంటూ ద్వేషాన్ని పెంచుకుంటున్నాం, విషజ్వాలలు, గ్రక్కుతున్నాం, విద్యార్జనలలోగానీ, ఉపాధిలో గానీ వారికి స్థానం లేకుండా చేస్తున్నాం.

కులము లేదంటూ కులవిభజన చేస్తున్నాం. ఇది గ్రహించే పూర్వం పెద్దలు కులమనిగానీ, మతమనిగానీ పేరులిడకుండా, వృత్తి ధర్మపరంగా ఉపాధులు కల్పించారు. ఆ వృత్తులు కూడా వృత్తంలోలా ఒకరికొకరు బలంగా రూపొందించారు. ఆ వృత్తి ధర్మగమ్యాలు చెడకుండా, రమ్యంగా, హర్షంగా ఉండేట్టు ఆ వృత్తిలోని వారితోనే సంబంధబాంధవ్యాలను కల్పించే సాంప్రదాయాన్ని ఏర్పరచారు. శుభానికీ, అశుభానికీ అందరు వృత్తిపరులూ కలుసుకునేట్టు చేశారు. పోటీపడడమనేది కానీ, ద్వేషం పొడసూపడానికి గానీ సూదిరంధ్రమంతటి అవకాశాన్ని సహితము కలుగ నీయలేదు. ఆ సిద్ధాంతము సాంప్రదాయంగా వర్ధిల్లినందువల్లనే రెండు వందల సంవత్సరాల పరాయి (విదేశీ) పాలనను సంఘటితంగా పోరాడి, స్వతంత్ర్యాన్ని సంపాదించకలిగాం. కొందరు తమ ప్రాణాన్ని దేశ స్వాతంత్ర్యం కోసం పణంగా పెట్టారు. కొందరు తమ సిరి సంపదల్నే త్యాగం చేశారు.


ఇప్పుడు కలిమాయ ప్రభావమో, రాజకీయ అంధత్వమో తెలియదు గానీ కులరాజకీయం, రిజర్వేషను వైషమ్యం, మత విద్వేషంతో దేశం అట్టుడికిపోతుంది. అసురత్వం, హింస, అసూయ, అవిజ్ఞానం ప్రబలిపోతున్నాయ్. మనదైన వేద శాస్త్ర, యోగ, సాంప్రదాయాన్ని పౌరాణిక సత్యాల్ని (కృష్ణుడున్నాడనీ, కురుక్షేత్ర సంగ్రామం జరిగిందని నాసా శాస్త్రవేత్తలు చెప్పారు) పశ్చిమ దేశస్థులు చెప్పగా నమ్ముతున్నాం. వారి ద్వేష, దోష, వేష, కావేష రాజకీయాల్ని గుత్తకు తెచ్చుకుంటు న్నాం.

**దేశమనెడి దొడ్డ వృక్షం ప్రేమయనెడి పూలెత్తవలెనోయ్!**


భగవంతునికి భక్తునికి
అనుసంధానమైనది


అంబికా దర్బార్‌బత్తి

# సనాతన ధర్మ పార్ధసారధి శ్రీ సత్యసాయిూ!



*ఆధ్యాత్మిక శక్తియొక్క పరిధి పెద్దది, ఉన్నతమైనది, ఉత్తమమైనది. రాజపీఠంగానీ, రాజకిరీటం గానీ ఆధ్యాత్మిక శక్తినీ, పరిధినీ, సామర్ధ్యాన్నీ ఏమాత్రమూ కించపరచలేవు. కాలానికీ, ప్రాంతానికీ, జాతికీ, దేశానికీ మించిన, అతీతమైన విస్తృత పరిమాణపు శక్తికల ఆయనే సనాతన ధర్మపార్ధసారధి! సనాతన ధర్మపార్ధసారధిగా, సద్గురువరేణ్యునిగా, ఎల్లలు లేని తేజోశీలిగా, కిరణప్రభాసమన్వితుడైన భాస్కరునిగా విరాజిల్లుతున్న భగవన్మూర్తి! పుట్టపర్తి ప్రశాంత నిలయపీఠవాసి భగవాన్ శ్రీ సత్యసాయిబాబా!*

*ఆయన కుల, మత, జాతి, ప్రాంతాల కతీతుడైన వ్యక్తి. భక్తజన హృదయమందారుడు, అరవింద దళాయతాక్షుడు, ప్రతీ మనిషీ ప్రేమను అలవరచుకుంటే, కుటుంబం మంచిగా మారుతుందనీ, కుటుంబం కారణంగా పరిసరాలూ, పరిసరాలు కారణంగా పల్లెలూ, పట్నాలూ, రాష్ట్రాలు, దేశాలు ప్రపంచం సర్వమూ ప్రేమమయంగా, శాంతిధామంగా విలసిల్లుతాయని మారిపోతుందని, మంచి భావాలకు ఊపిరిపోస్తున్న ప్రత్యక్ష భగవానుడు సత్యసాయిబాబా!*

## ‘ఎందరెందరని చెప్పను, ఎన్నిదేశాల వారని చెప్పను’ పర్తీ నీవు పుణ్యభూమివయ్యా

ఎన్నాళ్లకెన్నాళ్లకూ - కాలం కలిసొచ్చిందెన్నాళ్లకూ -

అంటూ ఊహ తెలియని రోజుల్లో పాడుకున్న భావంతో పాడుకున్న పాట. మహానటుడు చిత్తూరు నాగయ్యగారి షష్టాబ్ద్యుత్సవానికి విచ్చేసి, గాలిలోంచి ‘మంగళసూత్రము’లను తీసియిచ్చి, నాగయ్యగారి అర్ధాంగి మెడలో కట్టించిన నాటినుంచీ, సత్యసాయిబాబాను దగ్గరగ చూడాలనే తపన - తపనగానే ఉండిపోయింది. ఘంటసాల వెంకటేశ్వరరావు గారితోనో, ఆదినారాయణరావు (అంజలీ భర్త గారు) గారితోనో పుట్టపర్తి వెళ్లాలనెడి కల సహితమూ ఫలించలేదు. మధ్యలో వైట్‌ఫీల్డుకెళ్లినా - విపరీతమైన సెక్యూరిటీ కారణంగా దగ్గరి దర్శనం కలుగలేదు.

పిన్నతనంనుంచీ మహన్మూర్తుల్ని దర్శించాలనీ, వారితో భాషించాలనెడి ప్రగాఢ వాంఛితంతో కాలం, ప్రకృతి, శక్తీ, బుద్ధీ, యివన్నీ దోహదమిస్తాయనీ - ఓ భావన కలిగి ఉండేవాణ్ణి.

**కాలఃస్వభావో నియతిర్సదృచ్ఛా**
**భూతాని యోనిః నురుష ఇతి చింత్యా -**

**సంయోగ ఏషాం సత్యాత్మభావా**
**దాత్మాప్యనీశః సుఖదుఃఖ హేతోః -**

- అని శ్వేతాశ్వతరోపనిషత్తు చెప్పినట్టు - కాలము, ప్రకృతి, శక్తీ, బుద్ధీ యిత్యాదులన్నీ స్వతంత్రత కల్గినట్టివి కావు - ఒకదానిపైనొకటి ఆధారపడుతూ, భ్రమిస్తూ, సుఖదుఃఖాది విషయకారణభూతమవుతూ ఉంటాయని నిత్య జీవితంలో వీటిని అనుభవపూర్వకంగా గ్రహిస్తూ వచ్చారు. పుట్టపర్తి సాయిని సందర్శించలేకపోవడానికి ‘కాలం’ కూడా ఒక కారణం అనుకున్నాను. నావద్దకు వచ్చేవారిని పిచ్చుక కాలికి దారం కట్టి లాగినట్టు లాగుకుంటానన్నారు షిర్డీ సాయి. అదే చేశారు పర్తి సత్యసాయి.

వైరస్ జ్వరం వాతబడి, వైర్‌లెస్‌గా కమ్యూనికేషన్ భాగాలున్నట్టుగా శరీరభాగాలున్నాయ్. ఒకదానికొకటి సహకరించుకోవడం లేదు. మా రెండవ అబ్బాయి నారాయణ రావు పుట్టపర్తి ప్రయాణపు ఏర్పాట్లు చేశాడు, రమ్మన్నాడు. జుమ్మంది నాదం అన్నట్టు మనస్సు ముందుకు సాగింది. శరీరం ‘సై’ అంది. పన్నెండు గంటల బస్సు ప్రయాణం. నిశీది రాత్రిలోని ప్రతీక్షణమూ ‘కనులు’ గమనిస్తూనే ఉన్నవి. ధర్మవరంలో కాలకృత్యాలు కావించుకుని, ‘పుట్టపర్తి’ చేరుకొనే సరికి ఉదయం 8 గంటలు కొడ్తూంది. ప్రశాంతినిలయంలోనికి అడుగిడుసరికి, సత్యసాయి వారి ఉదయ దర్శనం, భజన సంకీర్తనం జరుగుతూంది. మసకచీకట్ల నందు మసలిన ఒళ్లూ, ప్రయాణ బడలికకు లోనైన ఒళ్లూ-ఒకింత సాంతమూ శాంతమొందినట్లనిపించింది. లీలా శుకులువారి -

**కదావా కాళిందీ కువలయదళ శ్యామల తరాః**
**కటాక్షాలక్ష్యంతే కి మపి కరుణా వీచి నిచితాః**
**కదనాకందర్పప్రతిభట జుటాచంద్ర శిశిరాః**
**కిమస్యంత స్తోషం దదతి మురళీ కేళి వినదాః**

- యమునా నదిలోని కలువరేకుల నల్లనయ్య శ్రీకృష్ణుని చూపులు ఎపుడు నాపై ప్రసరిస్తాయో, అడవిలోని లతల్లా పెనవేసుకున్న కుసుమపరాగాల్లా పరమేశ్వరుని ఝుటా ఝూటం లోని చలువచంద మామలా చల్లదనాన్ని పంపిస్తోంది. ఇలాటి యమునోత్పల సితాతర్పలోల శీతల సన్మురళీ నాదంబులు, విరిసినట్టూ, అమృత ఝురులు వర్షించినట్టూ భ్రమించాను.

ఎక్కడజూచినా, ఎవ్వరిని జూచినా నవ్వుతూ ‘సాయిరాం సాయిరాం’ అని ప్రేమతో పలుకరించేవారే! ఉత్తర భారత దక్షిణాత్యులే కాదు, తుమ్ పూరబ్‌హో హమ్ పశ్చిమ్ హై అని ఎల్లల నెన్న కుండా, ప్రాంతాలూ, మతాలూ, కులాలూ వ్యత్యాసం చూపకుండా, పెద్ద అధికారులూ, చిన్న అధికారులూ, నౌకర్లూ,

బంట్రోతులూ అనే తారతమ్యాలు లేకుండా సాయిరాం సాయిరాం' అనుకొనే ఏకైక ప్రదేశం అదే!


సైలెన్స్, నిశ్శబ్దం అనే హెచ్చరికలుండవు, నినాదాలుండవు, నువ్ ముందు, నేను వెనుక ఉన్నాను, నన్ను కొంచెం ముందుకు వెళ్లనివ్వండి అనే తోపుదులాటలుండని శాంత ప్రశాంత, వేదాంత ప్రదేశం. 'ఆమ్యామ్య' అనే చేతులెత్తే వారుండరు, అధికారం చెలాయించే వారస్సలు, 'మచ్చుకైనా ఉండని ప్రదేశం.

మరి రెండేళ్లు గడిచిన పిమ్మట మా మూడవ అబ్బాయితో కలిసి పుట్టపర్తి వెళ్లినపుడు కూడా అదే అనుభూతి. బెంగుళూరు నుంచీ పుట్టపర్తిలో ప్రవేశించుసరికి – అలనాడు అర్జునుడు ద్వారకలో ప్రవేశించిన అపురూపపు అద్భుత అనుభూతులు కలిగాయ్. ఆ ఆధ్యాత్మిక ఆదిభౌతిక వాతావరణమే అందుకు కారణం.

ప్రశాంతి నిలయంలో అడుగుపెట్టేసరికి బాబావారి దర్శనం, హారతులు కొనసాగుతున్నాయి. వినీలాకాశపు తెరలను చించుకుని పూర్ణ శశాంకుడు పొడుస్తున్నట్టు బాబావారి వదనం చలువ చంద్రికల్ని తురిమిపోస్తూంది. ఉదయం ఎనిమిది గంటలు కావస్తున్ననూ సూర్యకిరణ తీక్షణ వీక్షణంలో నునివెచ్చదనమే తప్ప వేడిమి లేదు.

సత్యసాయి పాఠశాలలోని విద్యార్థులు సత్యసాయీ ముంగిట నేల కుమ్మరించిన ముత్యాల్లా, సంక్రాంతి ముగ్గుల్లా, పోత పోసినట్టున్నారు. ఒక్కొక్క బృందం ఒక్కొక్క గీర్వాణ, ఆంగ్ల, ఆంధ్ర విద్యల్లో ఆరితేరినవారు. అగస్త్యుని వలే అన్నీ పుక్కిట పట్టినట్టున్నారు. వారు సత్యసాయీ మహిమల్ని గాన మాధుర్యంలో, నృత్యాభినయాలతో, భజన కీర్తనల ఫక్కీలో కొనియాడు తూంటే – 'అందరూ ఏకాగ్ర దృష్టితో, ప్రశాంత చిత్తంతో ఆలకిస్తున్నప్పుడు వారితో బాటూ నేనూ కలిసిపోయాను. నా నలుప్రక్కలా ఎన్నెన్ని దేశాల వారు ఉపవిష్టులై ఉన్నారో! ఎవరికి వారికి ఆయాభాషల్లో అర్థమైనట్టుగా ఉన్నారు. తన్మయు లౌతూ ఉన్నారు. నాలో కూడా ఏదో శక్తి తాదాత్మ్యచిత్తుణ్ణి చేసింది. రోదసీలో పయనించేవానికి శరీరం తేలికైనట్టు నా శరీరం కూడా తేలిక యైంది.

పోలీసు మిలట్రీ బలగాలు కూడా కూర్చలేని క్రమశిక్షణఅక్కడ కనిపిస్తున్నదంటే – ఏదో శక్తి లేకపోలేదు, భక్తి లేకపోలేదు, అంకిత భావుకత లేకపోలేదు.



వీటన్నిటికన్నా గొప్పది – ఎన్నదగినది ఆయన తెలుగువాడు. తెలుగు గడ్డపై పుట్టినవాడు, విశ్వవలయమంతటా ఆయన పేరు వ్యాపితమై ఉంది. ఆహ్వాన పత్రములు, పత్రికా, ప్రచార మాధ్యమిక ప్రకటనలు లేకుండానే ప్రపంచమంతటిలోని వ్యక్తులూ నవంబరు 23న జరిగే ఆయన జన్మదిన వేడుకల్లో పాల్గొంటారు. ఎన్నో యోజనముల దూరానున్న చందమామ వెన్నెల్నిగని, పుష్పములు వికసించి, భ్రమరములు మకరందం జుర్రుకున్నట్టే భక్తావేశంతో భక్తులు పరవశిస్తారు. ఇదెంతటి ఆనందం. ఇంక ఎక్కడైనా లభిస్తుందా? ●

# తెలుగువారు స్వాభిమానంతో తెలుగును పెంపు చేయాలి!

అచ్చమైన తెలుగును స్వయంగా పలుకు పదే పదే ఆంగ్లము పలుకుతూ పళ్లికిలించకు. పలుకుబడిగల తెలుగువాడవురా నీ ఇంటిలో నితర భాషలు పలికి తెలుగు నోట దుమ్ముకొట్టకురా!

పది కోట్ల తెలుగువారమున్నామని గొప్పలు చెప్పే మనం, సగం మందయినా తెలుగును మాట్లాడడం లేదంటే తలదించుకుంటూ సిగ్గుపడాలి. ఆదిలో సంస్కృతానికి అంకితమైనా, సంస్కృతిని మాత్రం విడనాడలేదు. అక్కచెల్లెళ్లకన్నా అన్యోన్యంగా రెండు భాషల్నూ కలిపి కవితలను చెప్పాం, వాటిని వినలేనివారూ, తెలుగుపై అభిమానం కలవారూ వ్యవహారిక భాషకు పట్టం కట్టారు, ఉద్యమాలు లేవదీశారు. అటు తరువాత హిందీ భాషవ్యామోహం పెరిగింది. గాంధీగారి సంతకంతో పట్టాలిస్తాం హిందీ నేర్చుకోండి అంటూ నయా హిందూస్థానీ నినాదంతో దక్షిణ భాషా హిందీ ప్రచార సభ యువకుల పై సమ్మోహనాస్త్రం సంధించింది. అటు తరువాత ఏ ఫర్ ఆపిల్ అంటూ ఆంగ్లం వచ్చి, ఉన్న నాలుకను ఊడకొట్టింది.

దేశంలో అత్యంత సంఖ్యాకులు ఆంధ్రులు కదా ప్రత్యేక రాష్ట్రం వస్తే తెలుగుకు వెలుగు కల్పించవచ్చునని భావించిన పెద్దల ఊహలు పటాపంచలయ్యాయి. తమిళనాట ఓహో అంటూ వెలిగిన తెలుగుబడులు తమిళ పాలకుల ధర్మంగా మూతబడుతున్నాయ్. కన్నడిగులూ, తమిళులూ, మలయాళీలూ తమ భాషాభ్యున్నతి పట్ల తీసుకొన్న శ్రద్ధను తెలుగువారు తీసుకోకపోవడంవలన తెలుగు వెలుగుకు దూరమైంది. మలేషియా, మార్షియస్, బర్మా, రంగూన్, ఇండోనేషియా వంటి దేశాల్లో ఉన్న తెలుగువారు ప్రభుత్వ లెఖ్ఖల్లో తెలుగువారుగా రాలేకపోతున్నారు. తమిళులుగానే లెక్క కట్టబడుతున్నారు. లెక్కకు మించిన తెలుగువారున్ననూ, తెలుగు వెలుగు అనేది లేదు. తెలుగువారమనే స్వాభిమానం కలిగి, తెలుగును అభ్యసించడం. మాట్లాడడం, తెలుగువారిగా తమ ఉనికిని ఆయా ప్రభుత్వాలకరిగించడం అవసరం.




# తెలుగు భాషపై మక్కువ పెరగాలి!

**శ్రీ సుందరం సుబ్బయ్యగారు తెలుగువారు, సుందరం సుబ్బయ్య మద్రాసు శివార్లలోని పోరూరులోనున్న గాంధీ నగరంలో ఉంటున్నారు. ఆయన' ప్రముఖాంధ్ర' వ్యాసాలనూ, శీర్షికలను చదివి ఉత్తేజితులై, ఒకటి రెండు వ్యాసాలను వ్రాసి పట్టుకుని వచ్చారు. తెలుగు భాషపై గల మక్కువతో, వయసును కూడా లెక్కించకుండా ఆంగ్లంలో ఆయన వ్రాసిన వ్యాస సారాంశాన్ని ఇందు ఉదహరిస్తున్నాను.**

తెలుగు వారి కెందుకనో తెలుగు భాషపై " మక్కువలేనట్టు తోస్తూంది. అదే తమిళుల్ని చూడండి. వారి భాషపై వారికున్న ప్రేమ, వాత్సల్యం, గౌరవం చాలా గొప్పవి. వారు యెక్కడున్నా, ఏలా వున్న 'తమిళుణ్ణి" అనిపించుకోవాలనీ, తమిళంలోనే మాట్లాడుకోవాలని సదా భావిస్తూంటారు. తమిళ సంస్కృతి కోసం తపించిపోతారు.

ఉదాహరణకు చూడండి- భారతదేశ అధికార భాషగా ఉన్న హిందీని తమిళదేశంలో అంతగా ప్రచారంలోనికి రానీయలేదు. తమ తమిళానికి ఎక్కడ విఘాతం కలుగుతోందనెడి భయంతో జాతీయ బాంకులపైనా, కంపెనీ, బోర్డుల పైన వ్రాస్తున్న హిందీ పేర్లను సహితమూ తుడిచి వేస్తున్నారు. తాము చేబడ్తున్న కార్యక్రమాలకూ సాధ్యమైనంత వఱకూ తమిళ పేర్లనే పెట్టుకుని వస్తున్నారు. తమిళ ప్రాధాన్యతనెలా కాపాడుకోవాల్నో వాళ్లకు బాగా తెలుసు. ఈ విషయాన్నే ఒకసారి విద్యవరేణ్యుడు శ్రీ నానా ఫాల్కీవాలా కూడా ఉటంకరించారు, వాళ్లను Right Thinking Personsగా అభివర్ణించారు.

భారతదేశంలోని భాషలన్నిటికినీ సమాన ప్రతి పత్తి ఉండడం చాల శ్రేయస్కరమనిపిస్తుంది. లేదా దాక్షిణాత్య భాషలైన తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం వారు సామరస్య ధోరణిలో తమ తమ భాషలభ్యున్నతికి సమష్టి కృషి సలుపాలి.

మన తెలుగు భాష' అత్యంత సుందరమైనదని ఆనాడు. ప్రముఖ తమిళకవి శ్రీ సుబ్రహ్మణ్య భారతియార్ చెప్పుకొని వచ్చారు. మన తెలుగు భాష యొక్క లక్షణ స్వరూపం, శబ్దపరంగానూ, దృశ్యపరంగానూ ఎంతో ఉత్తమమైనది.

శ్రీ సుందరం సుబ్బయ్య మద్రాసు. అందుకే నేను తెలుగు భాషను 'సత్యం శివం సుందరం'గా అభివర్ణిస్తాను. తెలుగు భాషోచ్చారణ సుందరత్వానికి మురిసి పోయి ఆనాటి నాణెముల్లో మన భాషను రెండవ భాషగా తీర్చిదిద్దారు.

భారతీయార్, భారతీదాసన్లు ప్రపంచం అంతటా తమిళం విస్తరించాలి. తమిళ ప్రపంచంగా కీర్తింపబడాలంటూ కవితలల్లారు, ప్రబోధనలు చేశారు. అందుకు ముగ్ధులైన ప్రజలూ, నాయకులూ వారల పేరిట గౌరవంతో విశ్వవిద్యాలయాలు కూడా నెలకొల్పి, వాళ్ల పేర్లుకు చిరస్థిర కీర్తులను సంపాదించి పెట్టారు. కానీ, నేను ఎఱిగినంతవఱకూ తెలుగు భాషా ప్రబోధం విషయంలో అంతటి శ్రద్దను గైకొన్న వారూ కనిపించడంలేదు, అలా పేర్లుతో విశ్వ విద్యాలయాలు నెలకొల్పినట్టు కూడా లేదు.

'తెలుగు' మన తాత ముత్తాతల తరాల్నుంచీ వెలుగునిస్తున్న ప్రాచీన భాష, సుందరమైనది. సుహృదయం కలది. ఈనాటి తెలుగు యువతీ యువకులు యెక్కడున్నా, యేం చేసన్తూన్నా తెలుగు భాషనూ, తెలుగు సంస్కృతినీ మరిచిపోకూడదు. తెలుగు భాష పై పట్టుని కలిగి వుండాలి. పంచ ప్రాణాల్లో ఒక ప్రాణంగా భావించాలి. ఇప్పటి తరం ఈ విషయంలో కృషిచేసి, రాబోయే తరాల వారికి తెలుగు తియ్యదనాన్ని, తెలుగుదనాన్ని అందిస్తారని ఆశిస్తున్నాను. ●

# గద్య సౌరభం

**ఆత్మశుద్ధి లేని ఆచారమది యేల**
**చిత్త శుద్ధి లేని శివ పూజ లేలరా?**
**భాండ శుద్ధిలేని పాకమేల**
**విశ్వదాభిరామ వినురవేమా!**

శుద్దీ, బుద్ధీ, శుచీ, రుచీ మనిషికి నాలుగు కాలాల్లోను అవసరం. ఇవి నాలుగూ ఆచరణలో పెట్టని వాడు చతుష్పాది (పశువు)తో సమానమంటారు.

ముఖ్యంగా మడీ, దడీ అంటూ కూర్చొనే ఛాందసులను గూర్చి వేమన పై పద్యం వ్రాసి వుంచారని అనుకుంటాను. ఆయన మడీ దడిలను లేశమాత్ర మైనా విమర్శించలేదని పై పద్యాన్ని బట్టే తెలుస్తుంది. మరి దేన్ని విమర్శించారు?

మనస్సుద్ధిలేని మడి ఎందుకున్నారు. నిజమే మనసును మలినంతో నింపు కుని ఆచారాన్ని ఒలక పోస్తే ఆ పరమాత్ముడిచ్చగించడు. ఇహ రెండవది కుండను (భాండం) గానీ, పాత్రనుగానీ శుభ్రపరచకుండా వంటచేస్తే ఆరోగ్య ప్రద మంటారా - కాదు. వండిన వంటకంలో క్రిములు చేరి శరీరారోగ్యాన్ని చెరిపివేస్తాయి.

ఇహ చిత్త శుద్ధి - చిత్తం అంటే మనసు. మనసును మోహ, వ్యామోహాలతో నింపుకుని శివుణ్ణి పూజిస్తే - ఏం ప్రయోజనం ఉంటుంది! అందుకే అంటారు - విఘ్నేశ్వరుని మీద భక్తా, ఉండ్రాళ్ల మీద భక్తాయని,

పూర్వం కవులుగానీ, యోగులు గానీ మానవుణ్ణి సత్ప్రవర్తనా పరునిగా తీర్చిదిద్దడం కోసరం అనేక పద్యాలు వ్రాశారు, గద్యాలు వ్రాశారు. ఆఖరికి విసిగి గుర్రంలా మసలుకోవోయ్ - అన్నారు. గుర్రం ఏం చేస్తుంది. కంటికి ఎదుట ఉన్న దాణానంతా ఒకేపళంగా తిన్నప్పటికినీ, మెల్లిమెల్లిగా ఆకలివేసినప్పుడల్లా నెమరువేసుకుంటూ ఉంటుంది. నీవుకూడా అనంతమైన విజ్ఞానాన్ని అలాగే చదివి అపుడపుడు సారాంశాన్ని నెమరువేసుకుంటూ (జ్ఞప్తికి తెచ్చుకుంటూ) ఉండని అర్థం. పై వేమన పద్యంతరార్ధంలో ఎంతో పరమార్ధం కూడుకున్నదనేది అస్మదీయుని అభిప్రాయం.

**- గోటేటి**







# తెలుసుకోండి

## ఏడుగురు అప్సరసల పేర్లు ఏవి?

1.రంభ, 2. ఉర్వశి, 3.మేనక, 4.తిలోత్తమ, 5.సుకేశి, 6. ఘ్రుతాచి, 7. మంజుఘోష.

## సప్త సంతానములు అంటే ఏమిటి?

1. తటాక నిర్మాణం, 2. ధన నిక్షేపం, 3. అగ్రహార ప్రతిష్ట, 4. దేవాలయ ప్రతిష్ట, 5. ప్రభంధ రచన, 6. స్వసంతానం (పుత్రుడు).

## తొమ్మిది రకాల ఆత్మలు ఏవి?

1. జీవాత్మ, 2. అంతరాత్మ, 3. పరమాత్మ, 4. నిర్మలాత్మ, 5. శుద్ధాత్మ, 6. జ్ఞానాత్మ, 7. మహాధాత్మ, 8. భూతాత్మ, 9. సకలాత్మ.

## పదిరకాల పాలు ఏవి?

1. చనుబాలు, 2. ఆవుపాలు, 3. బర్రెపాలు, 4. గొర్రె పాలు, 5. మేక పాలు, 6. గుర్రం పాలు, 7. గాడిద పాలు, 8. ఒంటె పాలు, 9. ఏనుగు పాలు, 10. లేడి పాలు.

## యజ్ఞోపవీతంలో ఎన్నిపోగులు ఉంటాయి?

యజ్ఞోపవీతంలో 9 పోగులు ఉంటాయి. ఆ తొమ్మిది పోగుల్లో 9 మంది దేవతలు నివసిస్తారు. వారు 1. బ్రహ్మ, 2. అగ్ని, 3. అనంతుడు, 4. చంద్రుడు, 5. పితృ దేవతలు, 6. ప్రజాపతి, 7. వాయువు, 8. సూర్యుడు, 9. సూర్య దేవతలు.

## అష్టాదశ ఆయుర్వేద సంహితలు ఏవి?

1. చరక సంహిత, 2. శూశ్రుత సంహిత, 3. పరాశర సంహిత, 4. హరిత సంహిత, 5. అగ్నివేశ సంహిత, 6. చ్యవన సంహిత, 7. ఆత్రేయ సంహిత, 8. భోజ సంహిత, 9. భృగు సంహిత, 10. బెడ సంహిత, 11. అగస్త్య సంహిత, 12. వరాహ సంహిత, 13. అత్రి సంహిత, 14. నారయణ సంహిత, 15. చంద్ర సంహిత, 16. నారసింహ సంహిత, 17. శివ సంహిత, 18. సూర్య సంహిత.

## గృహ నిర్మాణం ఏ విధంగా చేపడితే సర్వ సుఖాలు పొందుతారు?

1. ఈశాన్యంలో పూజలు, పవిత్ర కార్యాలును నిర్వర్తించే విధంగా పూజగది ఉండాలి.
2. ఆగ్నేయంలో అగ్నికి సంబందించిన వంటావార్పు చేసుకొనే విధంగా వంటగది ఉండాలి.
3. నైరుతిలో ఆయుధ సామగ్రి మొదలయిన వాటిని పెట్టుకోవడానికి ఒక గది ఉండాలి.
4. వాయువ్యంలో స్వతంత్రబిలాష చిహ్నములు.
5. తూర్పు దిక్కున సూర్యునికి ప్రీతికరమైన పనులు.
6. యమస్థానం అయిన దక్షిణం వైపు తలపెట్టి నిద్రించుట.
7. కుభేర స్థానం అయిన ఉత్తరం వైపు చూస్తూ నిద్రలేచుట.
8. వరుణ స్థానం అయిన పశ్చిమాన పాడిపశువులు పెంచుటకు తగిన స్థలం ఉండవలెను.

ఈ విధంగా చేయుటవలన ఆయా దిక్కులలోని ఉన్న దేవతలు సంతృప్తి చెంది ఆ గృహములో నివసించేవారికి సర్వసుఖాలు, సర్వ సంపదలు ఇస్తారు.

## పంచవిధ సూతకములు అంటే ఏమిటి?

1.జన్మ సూతకము 2. మృత సుతకము, 3. రజః సూతకం, 4. అంటు(రోగ) సూతకం, 5. శవదర్శన సూతకం.

## తాంబూలం సేవించేప్పడు తమలపాకు తొడిమ, చివర్లు ఎందుకు తుంచాలి?

తాంబులం వేసుకునే ముందు తమలపాకుల తొడిమలు, చివరలు తుంచివేయాలి. ఎందుకంటే తొడిమను తినడం వ్యాధికారకం అవుతుంది. చిగుర్లు పాపానికి ప్రతీకలు అని అంటారు. కనుక తమలపాకు తొడిమలు, చివరలు తుంచిన తర్వాతే తాంబులం వేసుకొవడం ఆరోగ్య ప్రధమం. అలాగే తమలపాకులో ఉండే ఈనెలు బుద్ధిని మందగింప చేస్తాయి. అందుకే తమలపాకును నమిలి మొదటగా నోటిలో ఊరిన రసాన్ని ఉమ్మివేయాలి. తొడిమలు, చివరలు తుంచివేసినా ఇంకా అవి తమలపాకులో శేషించి ఉంటాయి కనుక.

## నవగ్రహాలకు సంబంధించిన సమిధలు ఏవి?

1. సూర్యుడు - జిల్లేడు, 2. చంద్రుడు - మోదుగ, 3. అంగారకుడు - చంద్ర, 4. బుదుడు - ఉత్తరేణి, 5. బృహస్పతి - రావి, 6. శుక్రుడు - అత్తి, 7. శని - జమ్మి, 8. రాహువు - దర్భ, 9. కేతువు - గరిక.

## పుజాంగాలు ఎన్ని రకాలు?

పుజాంగాలు 5 రకాలు.

1.అభిగమనము - దైవాన్ని స్మరిస్తూ దేవాలయానికి వెళ్ళుట.
2. ఉపాధానము - పూజా సామగ్రిని సంపాదించుట
3. ఇజ్య - దూప, దీప, నైవేద్యములతో పూజించుట.
4. స్వాద్యాయము - తనకు తానుగా మంత్రోచ్చారణతో స్తుతించడం.
5. యోగము - తదేకమైన నిష్టతో ధ్యానించుట.

## గృహ నిర్మాణంలో ఇంటి కిటికీలు, ద్వారాలు ఏ విధంగా అమర్చాలి?

గృహంలో కిటికీలు, ద్వారములు సమసంఖ్యలో ఉండాలి. వేటికవే విడివిడిగా సమసంఖ్యలో ఉండాలి. కిటికీలు సరిసంఖ్యలోను, ద్వారాలు సరిసంఖ్యలోను ఉండాలి. అలమారాల గురించి శాస్త్రంలో ఏమీ చెప్పలేదు. వాటి ఉపయోగాన్ని అనుసరించి సరిసంఖ్యో, బేసి సంఖ్యలోనో పెట్టుకొవాలి. వాటికి స్థల నిర్ణయం కూడా చెప్పలేదు కిటికీలు , ద్వారాలు సరిసంఖ్యలో ఉన్నా చివరన సున్నా లేకుండా ఉండాలి. అనగా 10,20,30 ఇలా చివరన సున్నా రాకూడదు. అలాగే మొత్తం గృహంలో ఉన్న ద్వారాలు, కిటికీలు అన్ని లెక్కపెట్టాలి.

## వివిధ జన్మలు ఏవి?

1. దేవతలు, 2. మనుష్యులు, 3. మృగములు, 4. పక్షులు, 5. పురుగులు, 6. జలచరములు, 7. వృక్షములు.

## శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఏడుకొండల పేర్లు?

1. వృషబాద్రి, 2. నీలాద్రి, 3. గరుడాద్రి, 4. అంజనాద్రి, 5. శేషాద్రి, 6. వెంకటాద్రి, 7. నారాయణాద్రి.

## ఎవరెవరికి యే విధంగా నమస్కరించాలి?

1. విష్ణుమూర్తి యెక్క సర్వ అవతారాల విగ్రహాలకు మరియు శివునికి 12 అంగుళాల ఎత్తులో చేతులు జోడించి శిరస్సు వంచి భక్తి, శ్రద్దలతో వినయంగా నమస్కరించాలి.
2. ఇతర దేవుళ్ళకు శిరస్సు పై రెండు చేతులు జోడించి నమస్కరించాలి.
3. గురువుకి నోటితో "నమస్కారం" అని చెప్పకుండా రెండు చేతులు జోడించి వినయవిధేయలతో నమస్కరించాలి.
4. మహానుభావులకు, యోగులకు రెండు చేతులు వక్షస్థలంపై జోడించి నమస్కరించాలి.
5. తండ్రికి, పరిపాలకుడికి రెండు చేతులు నోటి మీదగా జోడించి నమస్కరించాలి.
6. తల్లికి ఉదరంపై రెండు చేతులు జోడించి నమస్కరించాలి.

## శ్రీ చక్రం నందు గల దేవతలు ఎవరు?

1. వశిని, 2. కామేశ్వరి, 3. మోదిని, 4. విమల, 5. అరుణి, 6. జయిని, 7. సర్వేశ్వరీ, 8. కాళిని.

## ధర్మం అంటే?

ధృతి, క్షమ, దమము, అస్తేయము, శౌచము, ఇంద్రియ నిగ్రహము, ధీ, విద్య, సత్యము, అక్రోధము. ఈ పది లక్షణములు కలిగినదే "ధర్మము".

## సహపంక్తి భోజనాల సమయంలో అందరూ ఒకేసారి లేవాలి అంటారు ఎందుకు?

సహాంపక్తి బోజనానికి కూర్చున్న వారందరి జీవన ప్రమాణం ఒకేవిధంగా ఉండదు. సహపంక్తి బోజనాలలో రకరకాల వారు ఉంటారు. వారిలో మంచివారు ఉంటారు. అలాగే చెడు అలవాట్లు ఉన్నవారు ఉంటారు. ఎవరి శరీరాల్లోని విద్యుత్

వారి వారి శరీరపు శక్తిని అనుసరించే పనిచేస్తూ ఉంటుంది . కాని సహపంక్తిలో కూర్చున్నప్పుడు దాదాపు అందరి శరీరాల్లోని విద్యుత్ నియంత్రణ అందరిలో ఒకేలా ఉంటుంది. అటువంటప్పుడు తక్కువ శక్తితో ఉన్న వ్యక్తీ అందరికంటే ముందుగా లేచినచో మిగిలిన వారి శక్తి అతనికి ఎంతో కొంత వెళ్ళిపోతుంది.

కనుకనే సహపంక్తి భోజనానికి కుర్చున్నప్పుడు ఎవరు ముందు తిన్నా, ఎవరు వెనక తిన్నా, అందరూ ఒకేసారి లేవాలన్న నియమం పూర్వకాలం నుండి ఆచరణలో ఉంది.

## దేవతా లక్షణాలు ఏవి?

1. రెప్పపాటు లేకుండుట, 2. భూమి మీద పాదాలు ఆనించకుండా ఉండుట,3. వ్యసనం లేకుండా ఉండుట.

## శ్రీ రాముని జన్మనక్షత్రం, మాసం ఎప్పడు?

శ్రీరాముడు చైత్ర మాసం, నవమి తిథిలో కర్కాటక లగ్నంలో జన్మించాడు. ఆయన జన్మ నక్షత్రం పునర్వసు.

## శ్రీవారి సుప్రభాతాన్ని ఎవరు ఎప్పడు రచించారు?

శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సుప్రసిద్ధ సుప్రభాతాన్ని రచించిన వారు శ్రీ ప్రతివాది భయంకర అన్నన్ అనే ఆచార్యులు. వీరు అష్టదిగ్గజాలుగా ప్రసిద్ధులైన శ్రీ మనవాల మహామునుల శిష్యులలో ప్రముఖులు వీరు క్రీ.శ. 1361లో జన్మించి 1454 వరకు అంటే 93 సంవత్సరాలు జీవించి ఉన్నారని పరిశోధకుల అభిప్రాయం.వీరు తమ జీవిత కాలంలో అనేక కృతులు రచించారు. వీరి రచనలలో శ్రీ స్వామివారి సుప్రభాతం అనన్య సామాన్యమైన ప్రచారం పొందింది.

## పంచ కోశాలు అంటే ఏమిటి?

1. అన్నమయ కోశం, 2. ప్రాణమయ కోశం, 3. మనోమయ కోశం, 4. విజ్ఞానమయ కోశం, 5. ఆనందమయ కోశం.

## శౌచమంటే ఏమిటి?

శుచి అంటే శుభ్రము, శుద్ధము. ధర్మాది పరీక్షల చేత భాహ్య అంతరములలో పరిశుద్దిని పొందుటయే "శౌచం" అనబడును. శౌచం రెండు విధములు : 1. బాహ్య శౌచం, 2. అంతః శౌచం.

బాహ్య శౌచం – శరీరం పైన ఉండే మలినాలను పోగొట్టుకోవడానికి చేసే స్నానాదులు, శరీరం పరిశుద్ధంగా ఉండేందుకు పూసే సుగంధ ద్రవ్యాలు వంటివి. వీటిని బాహ్య శౌచం అంటారు.

అంతః శౌచం – మనస్సులో ఎటువంటి చెడు భావాలు లేకుండా అంటే కామ, క్రోధ, లోభ, మోహ, మద , వాత్సర్యాలు లేకుండా నిర్మలమైన అంతహకం ణను కలిగి ఉండటమే అంతః శౌచం అనబడను. అంతః శౌచం మనస్సుకి సంబంధించినది. కాబట్టి దీనికి శాస్త్రాలలో అదిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది.

## ఏయే ప్రదేశాల్లో జపం చేస్తే ఎంతెంత ఫలితం?

ఇంట్లో చేసే జపానికి సత్ఫలితమే ఉంటుంది. కాని ఇంట్లో జపం చేస్తే అంతే ఫలితం ఉంటుంది. అదే జపాన్ని నది పరీవాహక ప్రాంతాల్లో చేస్తే రెట్టింపు ఫలితం ఉంటుంది. గోశాలలో చేసే జపం వల్ల వందరెట్ల ఫలితం ఉంటుంది. యాగశాలలో చేసే జపం వలన వందరెట్ల కంటే అధికమైన ఫలితం వస్తుంది. దేవాలయాలలో, పుణ్య ప్రదేశాలలో చేసే జపం వలన పదివేల రెట్లు ఫలితం కలుగుతుంది. శివాలయాలలో, శివ సాన్నిద్యం నందు చేసే జపం వలన అత్యున్నత మైన ఫలితం దక్కుతుంది.

## ఊర్ధ్వ పుండ్ర ములు ఎందుకు ధరిస్తారు ?

ఆర్య మతంలో ముఖధారణం (బొట్టు ) ఒక ఆర్ష సాంప్రదాయంగా ఏర్పడింది. అదిత్రి పుండ్రము, ఊర్ధ్వ పుండ్రము. అని రెండు రకాలుగా విభజించబడింది. వైష్ణవులు ఊర్ధ్వ పుండ్రములు ధరిస్తారు. స్త్రీలు తిలకధారణ చేస్తారు.

తిరుమణిని నిలువునా మూడు రేఖలుగా ధరించడంనే ఊర్ధ్వ పుండ్ర దారణ అంటారు. ఈ మూడు రేఖలు అకార, ఉకార, మకార స్వరూపమైన ప్రనవాన్ని సూచిస్తాయి. అకారం–సత్వ స్వరుపుడైన శ్రీ మహావిష్ణువును, ఉకారం–చిత్వ స్వరూపిణి అయిన మహాలక్ష్మిని, మకారం భగవద్భాక్తులైన భాగవతులను తెలియజేస్తాయని చెబుతారు. శైవులు భస్మాన్ని మూడు అడ్డరేకులుగా నుదుట ధరిస్తారు.

తిరుమణి మట్టికి సంబందించినది. కావున అది మట్టి నుండి కలిగిన ఈ శరీరం చివరికి మట్టిలోనే కలిసిపోతుందని సుచిస్తుంది. ఇందువల్ల వైరాగ్యం కలుగుతుంది. ముక్తి కోరేవానికి వైరాగ్యం చాలా ముఖ్యం. విభూతి దారణ కూడా ఈ శరీరం చివరికి బూడిద అయ్యేది అనే తత్వాన్ని నిర్దేశిస్తుంది. ముఖదారణ లేకుండా చేసే సత్కర్మలు నిరర్ధకాలు అని ఆగమాలు పేర్కొన్నాయి.

ద్వాదశ (12) ఊర్ధ్వ పుండ్రములు ధరించడం కూడా కద్దు. నాడులు, హృదయం మొదలయిన శరీర భాగములను చల్లబరుచుటకు కూడా ఆయా స్థానములలో ఊర్ధ్వ పుండ్ర దారణ అవసరమయిన వైజ్ఞానికంగా విశ్లేషణ చేసి కొంతమంది వివరిస్తున్నారు. ఉర్ధ్వ పుండ్రంలో ఉపయోగించే వస్తువులకు చల్లదనం కలిగించే లక్షణం ఉంది.

## నదులలోను, సముద్రాలలోను పవిత్ర స్నానాలు చేసేప్పడు పాటించవలసిన నియమాలు ఏవి?

నదీ స్నానం, సముద్ర స్నానం వంటివి చేసే ముందు నదీ స్నానం అయితే నదీమ తల్లిని, సముద్ర స్నానం అయితే సముద్రున్ని, అనంతరం క్షేత్ర దేవతల్ని, మనస్సులో స్మరించుకొని సంకల్పం చెప్పుకుని స్నానం చేయాలి.

రాత్రి పూట నిద్రించే టైములో ఒంటిపై ధరించిన వస్త్రాలతో నదిలో మునగరాదు. ఈ బట్టలను విడిచి శుభ్రమైన వస్త్రములను ధరించాలి.

పుణ్య నదులలో పాప పరిహారార్ధం చేసే పవిత్ర స్నానముల సమయంలో ఖచ్చితమైన నియమాలు పాటించి తీరాలి.

స్నాన అనంతరం ఆ బట్టల్ని నదుల్లో పిండరాదు అలాగే సబ్బులను ఉపయోగించి కూడా బట్టలను ఉతకరాదు.

అభ్యంగ స్నానం అంటే కుంకుళ్ళు, షాంపులు మొదలయిన వాటిని ఉపయోగించి తలంటు స్నానం చేయరాదు.

పొరబాటున కూడా నదిలోగాని, నదీ తీరాల్లోగాని మలముత్రాలు విసర్జించరాదు. ఈ నియమానికి వ్యతిరేకంగా చేస్తే పాపం అంటుతుంది.

ఆఖరికి నీళ్లను పుక్కిలించి ఉమ్మి వేసినా కూడా మహా దోషం అవుతుంది.

పవిత్ర స్నానములు ఆచరించే సమయంలో అ మంగళకరమైన మాటలు మాట్లడకుడదు. కసురుకోవడం, కోప్పడటం, వంటివి చేయకూడదు.

సముద్ర స్నానం కేవలం పర్వదినములలో మాత్రమే చేయాలి. మాములు సమయాలలో సముద్రాన్ని తాకకూడదు.

స్నానం చేసే ముందు సంకల్పం చెప్పుకోవాలి...

మహర్షులు అందించిన ననాతన ధర్మం మనది. ఇతర మతాల వారు పిల్లలని బాల్యం నుండి వాళ్ళ మతాలపై మంచి అవగాహనతో పెంచుతారు. కానీ సనాతన ధర్మమైన హిందూమతంలో పిల్లలు మాత్రం సరైన అవగాహన లేకుండా పెరుగుతున్నారు. యుగాల క్రితమే జ్ఞానం, విజ్ఞానం, అంతులేని నైతికత ఇలాంటివన్నీ నేర్పింది మన మతం. కానీ దాని స్వరూపంపై పెద్దలకే సరైన అవగాహన లేదు. అందువల్ల పిల్లలకు కలిగించలేకపోతున్నారు.

సనాతన ధర్మం అంటే ఆలయాలకి వెళ్ళి దండం పెట్టుకోవడమే అనుకుంటు న్నారు. ఈమధ్యకాలంలో పిల్లలు ఎక్కువగా ప్రశ్నిస్తున్నారు. అందుకే వివరణ ఇవ్వడం జరుగుతోంది.

## మన మతానికి ప్రవక్త ఎవరు? దేవుడు ఎవరు? గ్రంథం ఏమిటి?

ఇవీ పిల్లలు అడిగేవి. ఎందుకంటే ఒక్కొక్క మతంలో ఒక్కొక్క దేవుడు, గ్రంథం, ప్రవక్త కనబడుతున్నారు. మనకి అలా లేదేమిటి అని అడుగుతున్నారు. దీనినిబట్టి చూస్తుంటే ఇతర మతములు ఎలాగో ఇది కూడా అలాంటిదే అనుకుంటున్నారు. మరి ఒక మతానికి ఒక గ్రంథం ఉంది. కనుక అన్ని మతాలకు ఉండాలని, ఒక మతానికి ఒక ప్రవక్త ఉన్నాడు కనుక మన మతానికి కూడా ఉండాలని చెప్పడానికి లేదు. ఒక్కొక్క మతస్వరూపం ఒక్కొక్క విధంగా ఉంటుంది. ఎక్కువ తక్కువలు దేనికీ లేవు. అన్ని మతాలనీ మనం గౌరవిద్దాం.

## హిందూమత గ్రంథాలు

కానీ మన మతంపైన అవగాహన కలగాలి. మన మతం పేరు సనాతన ధర్మమని, హిందూధర్మమని, ఆర్ష ధర్మమని పేరు. అయితే విశేషించి ఈ సనాతన

ధర్మంలో ఒక గ్రంథం అంటూ ఉండదన్న్నాసం ఉంటుంది. అయితే్నేనం గాలిలోంచి వచ్చినట్లుగా కాకుండా దీనికీ ఏదైనా గ్రంథం చెప్పుకోవాలి అంటే సనాతన ధర్మానికి ఆధార గ్రంథం వేదం.

"వేదోక్తేన ధర్మమిదం" అని చెప్పుకోవాలి. వేదము యొక్క భాష కానీ, అందులో వచ్చిన అంశములు కానీ సామాన్య జనులకి ఉపదేశించే నీతి వాక్యాల్లా ఉండవు. మంత్రాలు ఋషుల సమాధి స్థితిలో దర్శించిన దివ్య శబ్దాలు. పరమ సత్యం సమాధి స్థితికి అర్థం అవుతుంది. కానీ మామూలు మనుషుల ఊహ, తర్కానికి, ఆలోచనకి గొప్ప ధర్మాలు అర్థం కావు. అది తపస్సు చేత వికసించిన అతీంద్రియ ప్రజ్ఞ కలిగిన ఋషులు ఏ సత్యాన్ని దర్శించారో ఆ సత్యాల సమాహారమే వేదము.

కనుక వాటిలోని అంతర్యాలని, అవి మనకు చూపిస్తున్న జీవన విధానాన్ని మనకి అందించడానికి మహర్షులు మరొక పనిచేశారు. అవే పురాణాలు, ఇతిహాసాలు, ధర్మశాస్త్రాలు. కనుక వేదాలు మొదలుకొని పురాణ, ఇతిహాస, ధర్మ శాస్త్రముల ద్వారా మన సనాతన ధర్మం వర్ధిల్లింది. కనుక పిల్లలు అడిగితే మనం చెప్పవలసింది సనాతన ధర్మానికి ఆధారం వేదం అని. వేదములలోని లోతైన భావాలు సామాన్యులకు అందజేయడానికై ఆ వేద ఋషుల్లో కొందరు మనకు పురాణాల్ని, ఇతిహాసాల్ని అందించారు. వారిలో వాల్మీకి, వ్యాసుడు, అగస్త్యుడు ఇలా ఎంతోమంది చెప్పబడుతూ ఉంటారు. వారందరూ ఇటు పురాణాల్లోనూ, అటు వేదాల్లోనూ తెలియబడుతూ ఉంటారు.

అంటే వేదాలలో ఉన్న మహర్షులే మనకి పురాణ, ఇతిహాసాల్లోన్నినాన్ని అందించారు.

ఇది సామాన్యులకు కూడా చేరడానికి వారు చేసిన ప్రక్రియ. అందుకే హిందూమతం అత్యంత సామాన్య జనుల్లోకి కూడా చొచ్చుకుపోయింది.

ఇవి హిందూమతానికి గ్రంథాలు అని తెలుసుకోవాలి.


### హిందూమతానికి ప్రవక్తలు ఎవరు?

ఇక హిందూ మతానికి ప్రవక్త ఎవరు? అంటే పరమేశ్వరుడే. "యస్య నిశ్వసితం వేదాః" అంటే పరమాత్మయొక్క ఊపిరియే వేదములు. పరమేశ్వరుడు ప్రవక్త అయినప్పటికీ కూడా పరమేశ్వర స్వరూపమైన వేదాలను మహర్షులు దర్శించారు.

కనుక మహాత్ములు అందరూ ప్రవక్తలే అని చెప్పుకోవాలి. ఈ మహర్షులు వేల సంఖ్యలో ఉన్నారు. ఇది ఒక ప్రవక్త ఇచ్చిన విజ్ఞానం కాదు. అనేకమంది మహర్షులు ఇచ్చిన విజ్ఞానం. సాధారణంగా ఇద్దరు, ముగ్గురు మూడు మాటలు చెప్తేనే ఒక మాటకి ఇంకొక మాటకి పొంతన కుదరదు. ఒక వ్యక్తికీ, మరొక వ్యక్తికీ పొంతన కుదరదు. ఇంతమంది మహర్షులు ఇంత విజ్ఞానం ఇచ్చినా ఎక్కడా పరస్పర విరుద్ధంగా లేవు. ఇది మనం తెలుసుకోవలసిన గొప్ప అంశం.

ఎవరియొక్క విజ్ఞానం వారిదే అయినా ఒకరి విజ్ఞానానికి ఇంకొకరి విజ్ఞానానికి వైరుధ్యం లేదు. ఇవన్నీ కలిపి సనాతన ధర్మం అనిపించుకుంటుంది. అది మన మతం యొక్క ప్రత్యేకత. ఈవిషయాన్ని పిల్లలకు తెలియజేయగలగాలి...



Beautiful City - Beautiful Hotel




Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

నెల్లూరు జిల్లాలో ఉన్న 'ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం' సంచాలకుడిగా మద్రాస్ యూనివర్సిటీ తెలుగుశాఖ మాజీ అధ్యక్షుడు, ప్రముఖ రచయిత ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ నియమితు లయ్యారు. ఆయన బాధ్య తలు స్వీకరించి నప్పటి నుంచి ఒక ఏడాది పాటు ఆ పదవిలో కొనసాగుతారు. మరో రెండేళ్ల పాటు ఆ పదవీకాలాన్ని పొడిగించే అవ కాశం కూడా ఉంది. ఈ మేరకు మైసూర్ లోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్' అసిస్టెంట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు జిల్లాకు చెందిన ఆచార్య మాడభూషి 1989 నుంచి 12 సంవత్సరాల పాటు పాత్రికేయ రంగంలో పని చేశారు. అనంతరం మద్రాస్ వర్సిటీ తెలుగుశాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్గా నియమితులై, అక్కడే శాఖాధి పతిగా పదవీ విరమణ చేశారు. తెలుగుతో పాటు ఆంగ్లం, తమిళం, కన్నడం భాషలపై మంచి పట్టున్న మాడభూషి 20కి పైగా రచనలు చేశారు. 200లకు పైగా జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు. వివిధ సంస్థల నుంచి పురస్కారాలు పొందారు. తెలుగు భాషాభివృద్ధి కోసం ప్రాణం పోసే పలు సంస్థల్లో వివిధ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# తెలుగు భాషా సౌరభం

వారిజాక్షులందు, వైవాహికములందు, ప్రాణవిత్త మానభంగమందు జకిత గోకులాగ్ర జన్మరక్షణ మందు బొంకవచ్చు నఘము నొందదధిప–

వేద శాస్త్రాలు అస్త్రాలు వంటివి, ఐతిహాసిక శాస్త్రాలు ప్రౌఢ వయసు వంటివి. ప్రౌఢ వయసు పొంగులో అబద్దానికొక నిబంధనా, నిబద్దత లేదని అలనాటి రాక్షసగురువు శుక్రాచార్యుల వారి నమ్మకం. అందుకే ఆయన అంటాడు బలిచక్రవర్తితో అబద్ధం ఆడవచ్చునోయ్ అని అంటాడు.

ఆడవాళ్ల దగ్గరా, పెళ్లిళ్ల దగ్గరా, ప్రాణా, మాన, దన, నష్టాలేతెంచినపుడు యమర్జెన్సీ రక్షణంగా భావించి అబద్ధం ఆడవచ్చునట –

ఈ విధంగా ఆనాడు శుక్రాచార్యులు వారు కొంత మినహాయింపును యిచ్చారు కాబట్టే, ఈనాడు ఎక్కడ జూచినప్పటికినీ అబద్దపుకోరుల జాబితా యెక్కువయింది.

అందుకే అంటారు కాస్త చనువిస్తే చాల్చు, చంకెనిక్కి కూర్చుంటాడని – కూడా పెద్దలు అంటూంటారు.

రాజకీయ, వ్యాపారరంగాలు కూడా చీటికీ, మాటికీ అబద్ధం ఆడవచ్చునని ఆనాడు ఆయన చెప్పలేదు. కారణం ఆనాడు రాజకీయంగా పార్టీలనేవి లేవు, సినిమాలు లేవు, విస్తృతమైన వ్యాపారములు లేవు. కాబట్టీ అబద్దానికి ఎన్ని మినహాయింపు నొసగినప్పటికినీ ఒక హద్దూ పద్దూ ఉంటూ వచ్చింది.

కృష్ణ పరమాత్ముడెంత చెప్పినప్పటికినీ ధర్మరాజు ఆ అత్యవసర సమయంలో భయపడుతూ "అశ్వత్థామా హతః" అని చివర నెమ్మదిగా 'కుంజరః' అన్నాడు అంటే అశ్వత్థామ చచ్చిపోయాడనే – కానీ అది ఆ పేరుగల ఏనుగు మాత్రం సుమా అన్నాడు నెమ్మదిగా అప్పటికే ఆయనకు కొంతలో కొంతగా పాపం వచ్చిందట.

కానీ పై పద్యంలో సాక్షాత్తూ గురువులైన శుక్రాచార్యులు వారు చెప్పినప్పటికినీ బలిచక్రవర్తి వినలేదు. అబద్ధం ఆడనన్నాడు.

'అయితే నీ ఖర్మ' అంటూ శుక్రాచార్యులు వారు రుసరుసమని వెళ్ళి పోయారు. మారువేషంతో వచ్చిన విష్ణుమూర్తుల వారికి మూడడుగుల భూమి కోసం తన శిరస్సును వంచి, జీవన్ముక్తి పొందాడా మహారాజు.

కానీ ఈ నాడు అబద్ధాలకు వెనుకాడడం లేదు. శిరస్సు వంచే పనులు చేయడానికి కూడా ప్రజలు వెనుకాడడంలేదు.

# పరమార్థ కథలు




**శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు**

## సోమరి శిష్యుడు

గురువు : చెంచూ! పాఠాలు బాగా చదువుతున్నావా!

శిష్యుడు : స్వామీ! బ్రహ్మాండంగా చదువుతున్నాను.

గు : అన్ని పాఠాలు జ్ఞాపకముంటున్నవా?

శి : శ్రద్ధగా చదువుతున్నాను.

గు : చదువుతున్నావు సరే. చదివినవి జ్ఞాపకముంటున్నవా అని,

శి : కొన్ని జ్ఞాపకం ఉంటున్నవి. కొన్ని మరచిపోతున్నాను.

గు : అన్నీ జ్ఞాపకముంచుకొనేటట్లు చూడు.

శి : స్వామీ నాకైతే జ్ఞాపకముంచుకోవాలనే ఉంది. మొన్న ఒకాయన "అన్నీ జ్ఞాపకముంచుకుంటే తల వేడెక్కుతుంది" అన్నాడు

గు : అందుకని ఏం చేశావు?

శి : కొన్నివదిలేశా, కొన్ని ఉంచుకున్నా.

గు : ఏవేవి ఉంచుకొన్నావు!

శి : భోజనాన్ని గూర్చిన, పడకను గూర్చిన సంకల్పాలు ఉంచుకున్నా.

గు : మఱి పాఠాల సంగతి?

శి : వేడిభయం వల్ల వదిలేశా.

గు : ఓరి సోమరిపోతా! పాఠాలు చక్కగా చదివి జ్ఞాపకం పెట్టుకో. దానివల్ల విద్య బాగా అలవడి భవిష్యత్తులో నీకు ఎంతో మేలు కలుగుతుంది.

శి : మహాప్రభో! సెలవిచ్చారు! ఇక మీదట తమ ఆదేశం ప్రకారమే చేస్తాను.

● ● ●

గురువు : ఏమిరా! మల్లయ్యా! అలా నిలబడ్డావు?

శిష్యుడు : మహాప్రభో! తమరు నాకొకటి అనుగ్రహించాలి.

గు : ఏమిటిది?

శి :మోక్షం.

గు : అది నీకెప్పుడు కావాలి?

శి : సాయంత్రం లోపల.

గు : ఒకవేళ ఇస్తే దానిని ఎక్కడ దాచుకుంటావు?

శి : నా గదిలో

గు : ఓరి పిచ్చివాడా? మోక్షమనేది ఒక వస్తువుకాదు. ఇచ్చిపుచ్చుకొనే పదార్థము కాదు. గదిలో దాచుకొనేది అంతకంటే కాదు. అంత చవకగా అదిదొరకదు. దానికి ఎంతోకాలం జపం, ధ్యానం, విచారణ, ఇంద్రియ నిగ్రహం, మొదలైనవి చేయాలి. అటువంటివి నీవేమైనా చేశావా?

శి : మహాప్రభో! అవి తప్ప తక్కినవన్నీ చేశాను.

గు : పోనీ! ఇప్పుడైనా వాటిని చేయటానికి ఇష్టపడతావా? కష్టపడందే, ఏదైనా కొంత త్యాగం చేయందే గొప్ప స్థితిఎట్లా లభిస్తుంది?

శి : స్వామీ! తమరు ఎంతోకాలం బాగా సాధనచేసి, తపస్సు చేసి మోక్షాన్ని సంపాదించినారు. తమర్ని ప్రార్థించేది ఏమిటంటే ఆ మోక్షం నాకు దయచేయమని.

గు : అట్లా వీలుపడదు. ఎవరిమోక్షం వారే ప్రయత్నంచేసి సంపాదించు కోవాలి. ఎవరి ఆకలి వారే పోగొట్టుకోవాలి, ఎవరి గ్రుడ్డితనానికి వారే మందువేసుకోవాలి. గురువులు, పెద్దలు, శాస్త్రాలు దారి చూపుతివి. నడవాల్సింది శిష్యుడు తనకు తానే. ఇంతకీ నేను చెప్పిన సాధనలు చేస్తావా లేదా?

శి : మహాప్రభో! నా బదులు ఎవరైనా చేస్తారో లేదో కొందర్ని ముందుగా అడిగి చూడాలనుకున్నాను, ఎవరూ దొరక్కపోతే స్వామీ! తప్పకుండా చేస్తాను.

గు : ఓరి సోమరిపోతా! నీ బదులు ఎవరైనా అన్నం తింటే నీ ఆకలి తీరుతుందా? ఇప్పటికైనా తెలుసుకో, వెంటనే జపం మొదలుపెట్టు. గీతాపారాయణ ప్రారంభించు, పెద్దల్ని ఆశ్రయించు, నియమాలు పెట్టుకో, సోమరితనాన్ని దూరంగ పారెయ్యి, ఒకింత శ్రమ చేస్తే మోక్షం దానంతట అదే వచ్చి నిన్ను ఆశ్రయిస్తుంది. తెలిసిందా?

శి : బ్రహ్మాండంగా తెలిసింది. మహాప్రభో! నన్ను కడతేర్చారు. ఈ రోజే జపమాల తెచ్చుకొని సాధన ప్రారంభిస్తా!

● ● ●

గురువు: నాయనా! గురువులు, పెద్దలు కనిపించినప్పుడు వెంటనే నమస్కారము చేయుట నేర్చుకొనుడు.

శిష్యులు:అలాగే స్వామీ!

(గురువుగారు పొరపాటున బావిలో పడిరి. శిష్యులు ఒక త్రాడును బావిలో వదిలిరి. గురువుగారు త్రాడును పట్టుకొనగా శిష్యులు పైకి లాగుచుండిరి. బావి పై అంచుకు రాగానే శిష్యులు గురువుగారికి నమస్కరించాలని భావించి త్రాడు వదలి 'గురువు గారూ! నమోన్నమః' అని చేతులెత్తి నమస్కరించిరి. గురువు గారు తిరిగి బావిలో పడిపోయిరి).

**నీతి:- పెద్దలు చెప్పిన విషయములను వివేకము ఉపయోగించి సందర్భము ననుసరించి పాటించవలెను.**

● ● ●

గురువు : ఏమిరా! సోమయ్యా ఈమధ్య చాలారోజులనుండి కనిపించడం లేదేమి?

శి : స్వామీ! ఒకటే ఆలోచన పట్టుకుంది మోక్షానికి ఎపుడు చేరదామా! అని. ఆ ఆలోచనతో మనస్సు తన్మయమై కొద్దిరోజులు అట్లా తిరిగి వచ్చా.

గు : ఏమైనా దారి దొరికిందా చివరికి?

శి : స్వామీ! ఇంతవఱకు దొరకలేదు. అది తమరే అనుగ్రహించాలి, మోక్షం త్వరగా పొందాలని నాకు చాల కాలంనుంచి తహతహగా ఉంది. మోక్షం పొందటానికి సులభమైన సాధన ఏదైనా ఉంటే దయచేసి సెలవిస్తారా?

గు : లేకేమి "నీ వెవరవో తెలుసుకో" ఇదే మోక్షానికి చక్కనిసాధన.

శి : స్వామీ! నేనేవరో ఇది వఱకే తెలుసుకున్నా.

గు : ఎవరు నీవు?

శి : తమరి శిష్యుణ్ణి,

గు : అదికాదు శంభూ, అసలు నీస్వరూప మేమిటో తెలుసుకో.

శి : బాబూ! అదేమిటో అర్థం కావటంలేదు. దానికంటే సులభమైన ఉపాయం ఇంకేమైనా ఉంటే చెప్పండి స్వామీ!

గు : పోనీ నామస్మరణ చేస్తావా? దానితో మోక్షం సులభంగా వచ్చేస్తుంది.

శి : స్వామీ! నామస్మరణ నేనే చేయవలసియుండునా, నా బదులు ఇంకెవరైనా చేయవచ్చా?

గు : రోజూ భోజనం నీవే చేస్తున్నావా? నీబదులు ఎవరైనా చేస్తున్నారా? ఎవరు కష్టపడతారో వారే సుఖిస్తారు. చేసుకున్నవాడికి చేసుకున్నంత మహాదేవ.

శి : చక్కగా సెలవిచ్చారు, అట్లాగైతే నామస్మరణ తప్పకుండా మొదలు పెడ్తాను. అయితే బాబూ! ఒక సందేహం ఈ నామస్మరణ కొద్దిరోజులైనాక ప్రారంభించవచ్చా?

గు : ఓరి సోమరిపోతా! చావు ఎప్పుడువస్తుందో ఎవరికీ తెలియదు గదా. ఎప్పటి కప్పుడు పుణ్యబలం సంపాదించి సిద్ధపడి ఉండవద్దా?. రేపు రేపు అని పని వాయిదా వేస్తూ పోతూంటే ఎట్లా? ఇట్టి చక్కని అవకాశం మళ్ళా దొరుకుతుందా? పిచ్చివాడా! ఈక్షణంనుంచే నామం మొదలుపెట్టు పో!

శి : భలే బోధచేశారు స్వామీ! తమ ఆదేశం శిరసా వహిస్తా. ఇప్పుడే భజనమందిరా నికి పోతున్నా నామం చేయ్యటానికి 'రఘుపతి రాఘవ' . అయితే స్వామీ! ఈప్రకారం చేస్తే సాయంత్రానికి పూర్తి మోక్షం వచ్చేస్తుందా?

గు : తొందరపడబాకా! ఓరి సోమరీ! నీకసలు శ్రద్ధే లేనట్లుందే? ముందు కార్యం చేయి, ఫలితం తరువాత దానంతటది అదే వస్తుంది. తెలిసిందా?

శి : బ్రహ్మాండంగా తెలిసింది. ఈరోజు మంచిమంచి సంగతులు చెప్పి నన్ను కడతేర్చారు. మహాప్రభో! కృతార్థుణ్ణి అయినాను, నా జీవితంలో ఇక నామస్మరణగాని, దైవవిచారణగాని మఱువనే మఱువను. సెలవు!

● ● ●

గురువు : ఏమిరా మురళీ! సాధన ఎంతవఱకు వచ్చింది?

శిష్యుడు : స్వామీ! ఈమధ్య బ్రహ్మాండంగా అభివృద్ధికి వచ్చింది. కాని మొన్ననే చప్పగా దిగజారిపోయింది.

గురువు : అజాగ్రత్తగా ఉన్నావా ఏమి?

శిష్యుడు : స్వామీ! తమరు ఎంతెంతో చెప్పారు, సాధనలో ఏమరుపాటు పనికిరాదని. కాని అదేమి ఖర్మమో నామటుకు నేను ఎంత జాగ్రత్తగా ఉన్నా మాయ ఒక్కతోపు తోసివేసింది. వెళ్ళి అమాంతంగా పాతాళంలో పడ్డా మధ్య ఎక్కడా ఆగకుండా!

గురువు : ఏం జరిగింది మురళి అంతా వివరంగా చెప్పు?

శిష్యుడు : స్వామీ! చాలాకాలంనుంచి ప్రతిసోమవారం మౌనం శీలిస్తున్నా కాని క్రిందటిసోమవారం నేను మౌనంగా ఉంటూంటే వాడెవడో వచ్చి నన్ను శుంఠ అని తిట్టాడు. ఆ మాట వినగానే నాకు పొడుచుకొనివచ్చి "శుంఠ నేనా, నువ్వా?" అన్నాను. వాడు పోయినతరువాత "అయ్యో! వట్టి పుణ్యానికి మౌనం చెడగొట్టు కున్నానే" అని దిగులుపడ్డా.

గురువు : ఇంతేనా ఇంకేమైనా పొరపాటు చేసావా?

శిష్యుడు : ఇంకొక్క పొరపాటుకూడ జరిగింది స్వామీ. ఇంతవఱకు ప్రతి ఏకాదశి తమరు చెప్పినప్రకారం ఉపవాసం చేస్తూ ఉన్నా. కాని మొన్న ఏకాదశికి అదేమిటోగాని మధ్యాహ్నం ఒంటిగంటకు చెడ్డ ఆకలి పుట్టుకొచ్చింది. ఎట్లాగో కొంతసేపు బిగపెట్టు కొని కూర్చొన్నా ఆ తరువాత ఇక లాభం లేదనుకొని సరాసరి పూజామందిరములోకి వెళ్లి భక్తులు తమకు సమర్పించిన ఫలహారం యావత్తు తినివేసినాను. పొరపాటు క్షమించండి.

గురువు : వ్రతంలో దృఢత్వం నీకింకా ఏర్పడలేదు. ఈమధ్య సోమరితనంకూడ నీలో కొంత ప్రవేశించింది. ప్రొద్దున పారాయణానికి కూడ సరిగా రావటంలేదు.

శిష్యుడు : మహాప్రభో! నాకేమో బాగుపడాలనే ఉంది. కాని ఏదో నన్ను పడగొట్టు తుంది. అదేమో నాకు అర్థంకావడం లేదు.

గురువు : అదే పాతవాసన. అనేక జన్మలనుంచి తమోగుణం, రజోగుణం నిన్ను వెంటాడుతున్నాయి. అజాగ్రత్తగా ఉన్నవాళ్లను అవి పరమపదసోపానపటంలోని పెద్దపాములాగా క్రిందకు చేరవేస్తువుంటవి. తరించాలని పట్టుదల కలిగి కొంచెం జాగ్రత్తగా ఉన్నవాళ్లని అవి ఏమీ చేయలేవు. కాబట్టి ఇక నియమాల్లో బహు జాగ్రత్తగా ఉండు.

శిష్యుడు : మహాప్రభో! ఇకమీదట సోమరితనాన్ని దూరంగా తరిమివేస్తా.

గురువు : ఎప్పట్నుంచి?

శిష్యుడు : వచ్చేవారం మొదలుకొని.

గురువు : ఓరి పిచ్చివాడా! అట్లా వాయిదాలు వేయబాకా! అధ్యాత్మమార్గంలో వాయిదాలకు చోటులేదు. ఏ క్షణం మంచి విషయాలు వింటావో ఆ క్షణం నుంచే ఆచరణలో పెడ్తూ ఉండాలి.

శిష్యుడు : ధన్యోస్మి !అట్లాగే చేస్తాను మహాప్రభో! సకాలంలో హెచ్చరిక చేసి నన్ను గట్టెక్కించారు తండ్రి! తమకు శతకోటి నమస్కారాలు.

ఓమ్


SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.

Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*



# భారతీయ ధర్మగుణం కూడా వలస పోతుంది! స్వార్థం నడినెత్తి సూర్యతాపంలా విజృంభిస్తూంది.

బలి శిబి వంటి చక్రవర్తులు, రంతి దేవుడు, తమ్ము తాము అర్పించుకున్న ధర్మమూర్తులు. ధర్మగుణానికి, దాతృత్వానికీ భారతదేశాన్ని మించిన దేశం ప్రపంచ చరిత్రలో లేనేలేదు.

అలాటి ఈ పవిత్ర భారతదేశంలో శ్రీమంతులూ, శ్రమంతుల దారుణాలకు అంతే లేకుండా ఉన్నది. దోచుకోవడమన్నదే విధానమైపోయింది.

అమెరికాలోని గొప్ప వ్యాపారవేత్త, ధనవంతుల్లో రెండవ స్థానంలో ఉన్న వారన్ బఫెట్ తన ఆస్తుల్లోని 85వ శాతం సంపదను ధర్మసంస్థలకూ సేవా సంస్థలకూ విరాళమివ్వ నిర్ణయించాడు. సుప్రసిద్ధ ఆంగ్ల చిత్ర ఫైర్ బ్రాండ్ నాయకుడు జాకీచాన్ తన సగం ఆస్తులను అనగా 50 కోట్ల హాంకాంగ్ డాలర్లను పేదప్రజలకు యివ్వడానికి నిర్ణయించి మిగతాది తన భార్యా పిల్లలకూ వ్రాసి యిచ్చేశాడట. కోట్ల మీద ఆస్తులు కలిగీ, ఇంకనూ కోట్ల ఆస్తులను ఆర్జిస్తున్న మన శ్రీమంతులు చిల్లర కాసును సహితమూ ధర్మం చేయడానికి సహించరు.

సినిమావాళ్ళ విషయం చెప్పనే అక్కర్లేదు. క్రికెట్లు ఆడి ఇస్తామనీ, నాటకాలు ఆడి ఇస్తామనీ చెప్పడమే తప్ప జేబులోని పైసా విదపరు.



(గోటేటి వేంకటేశ్వరరావు)

# మీరు నిజంగా నా బిడ్డలైతే దేనికి భయపడరు మీరు సింహాల్లా వుంటారు.

- స్వామి వివేకానంద



## జీ.వి. రావ్ పేజీ

**భా**రతదేశం ఒక అద్వితీయ దేశం. ఎన్నో విదేశీ దండయాత్రలకు గురైనా తనదైన సంస్కృతిని నిలబెట్టుకుంది. తన ఉనికిని పోగొట్టుకోలేదు. ఐదు వేల ఏళ్ళ చరిత్రలో ఎప్పుడు భారతదేశం తనకు తానుగా ఏ దేశంపైనా దండయాత్ర చెయ్యలేదు. ప్రపంచం మన మాతృభూమికి ఎంతో ఋణపడి వుంది. ప్రతి దేశం క్షమామయుడైన హిందువుకు ఋణపడినంతగా మరే జాతికి ఋణపడి లేదు. గ్రీకు దేశం పుట్టకముందు నుంచి, రోమ్ నగరాన్ని ఊహించక ముందునుంచి ఐరోపా జాతుల వారు అడవుల్లో తిరుగుతున్న కాలంలోనే భారతదేశం నుంచి ధర్మ ప్రచారాలు సాగాయి. మన దేశ పురాణ గాథల్లో ప్రతి మాట ముందర ఒక శాంతి సందేశం, ప్రతి వాక్కూ ఒక అనుగ్రహ పూర్వకంగా పలికాయి. సామరస్య భావం గురించి, మనిషిలోని దివ్యత్వం గురించి మన భారతదేశం కొన్ని వేల ఏళ్ళకు ముందే గుర్తించింది.

అటువంటి భారతదేశాన్ని, దాని సంస్కృతి, సాంప్రదాయాన్ని దైవం పట్ల వున్న విశ్వాసాన్ని ముఖ్యంగా హిందూ జాతిని నాశనం చెయ్యడానికి కుట్ర జరుగుతూ వుంటే, మనకి ఏమి పట్టనట్టు వూరుకొన్నాం. ఒకప్రక్క తిరుమల కొండపై అన్య మత ప్రచారం జరుగుతోందని తెలిసినా, లేదని బుకాయిస్తున్నాం. అయ్యప్ప భక్తుల విశ్వాసాన్ని దెబ్బ తీసినా వూరుకున్నాం. మరో ప్రక్క హిందు జాతిని బాంబులు పెట్టి చంపుతూ బొంబాయిలో, కాశ్మీర్‌లో, బెంగాల్‌లో, కేరళలో హిందు కుటుంబాల్ని మాత్రమే హతమారుస్తూ వుంటే అందరం నోరుమూసుకుని వూరుకొన్నాం. శంకరా చార్యులు వారు చెప్పినట్లు "దుర్బలాన్ అజితేంద్రి యాన్ ప్రాప్య యోగో నష్టః" అంటే ధర్మం అనేది ఆచరణశూన్యులు, అజితేంద్రియులు (అంటే సంయమనం లేనివారు) దుర్బలుల చేతిలో పడి నశిస్తోంది. దీనిని సమాజంలోని ఏ పెద్దలు నోరు తెరిచి గర్హించకపోవడం ఆశ్చర్యం. అవమానకరం. వారు ఎంత పెద్దవారలైనా సరే వారి పేరుకి వెనుక ఎన్ని పట్టాలు (డిగ్రీలు) వున్నా, ఎన్ని హోదాలు వున్నా, మఠాధిపతులు, పీఠాధిపతులు, స్వామిజీలు ఎంద రుండి ఏం లాభం వారందరు ద్రౌపది వస్త్రాప హరణం జరుగుతున్నప్పుడు కౌరవ సభలోని నోరు మెదపని భీష్మ, ద్రోణాచార్యులకు సమమే.

రాయప్రోలు సుబ్బారావు గారన్నట్లు

**ఏ పూర్వపుణ్యమో ఏ యోగ బలమో**
**జనియించినాడు నీ స్వర్గ ఖండమున**
**ఏ మంచి పూవులన్ ప్రేమించినావో**
**నిను మోచె ఈ తల్లి కనక గర్భమున.**

ఇటువంటి ఈ స్వర్గభూమిలో జన్మించి ఆ భారతమాత గర్వించేలా జీవించాలి కాని, ఆ తల్లి మనస్సు నొప్పింప కూడదు.

ఎవరికి లేని బాధ నీకెందుకు అని నన్ను అందరూ వారిస్తున్నా నా మనసులోని మాట వ్రాయక తప్పటంలేదు.

* * *

# మట్టి వాసన మర్చిపోవద్దు

**తె**లుగువారు వృత్తి ప్రవృత్తుల రీత్యా ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లినా మూలాలను, మట్టి వాసనను, మాతృభాషను, సంస్కృతి సంప్రదాయాలను విడనాడవద్దని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ కోరారు. 'గ్రామీణ ప్రాంతాల నుంచి అనేక కష్టనష్టాలు ఎదుర్కొని మీరు ఇక్కడకు వచ్చారు. ఆస్తులు అమ్మి మిమ్మల్ని చదివించిన తల్లిదండ్రులను గుర్తుకు తెచ్చుకోండి. మట్టి వాసన మర్చిపోకండి. మీ బంధుమిత్రులు, చదువు నేర్పిన గురువులను తప్పనిసరిగా ఏడాదికి ఒకసారో, రెండుసార్లో కలిసి మాట్లాడండి. ఫోన్లో మాట్లాడటంకంటే స్వయంగా వెళ్లి పలకరిస్తే వచ్చే అనుభూతి వేరు' అని ఆయన చెప్పారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన వాషింగ్టన్ డీసీలో ప్రవాస భారతీయులు ఏర్పాటుచేసిన 'మీట్ అండ్ గ్రీట్'లో పాల్గొని మాట్లాడారు.

తెలుగుకు విదేశాల్లో గుర్తింపు సంతోషకరం : తెలుగుజాతి గొప్పదనాన్ని, తెలుగు ఘనతను ప్రపంచానికి చాటిచెప్పిన ఎన్టీఆర్ వాక్చాతుర్యానికి, ఘంటసాల గాత్రానికి, వారి ఉచ్చారణకు. ముగ్ధులమైన మా తరంవాళ్లు తెలుగు భాషపై పట్టు సంపాదించుకోగలిగాం. పున్నమి వెన్నెల, తియ్యని తేనె, కోయిల కిలకిలారావాలు, మంచిగంధపు పొడి, మల్లెపూల పరిమళం, గులాబీ రేకుల మార్దవం, వేసవి సాయంకాలపు వానజల్లు, చల్లని గాలి, కృష్ణశాస్త్రి కవిత్వం.. ఇలా సృష్టిలో హాయిగొలిపే అన్నింటిని రంగరించిందే తెలుగు భాష అని ఒక కవి అన్నారు. అలాంటి తెలుగు బలపడే విధంగా, గొప్ప అంతర్జాతీయ భాషగా గుర్తింపు తెచ్చేలా మనం కృషి చేయాల్సి ఉంది. తెలుగు బిడ్డలుగా పుట్టడం అదృష్టంగా భావించాలి. తెలుగు భాషకు వేరే దేశాల్లో ఎక్కువ గుర్తింపు రావడం సంతోషకరం. మీ పిల్లలకు ఎలాం తెలుగు భాష, సంస్కృతులు నేర్పుతున్నారో అలాగే మీరు పుట్టిన ప్రాంతాల్లో తెలుగు పాఠశాలల బాగుకు ఒక సంస్థలా ఏర్పడి కృషి చేయాలి అని ఎన్.వి. రమణ ఉద్బోధించారు.

# సినీ జగత్తులో ఆ అయిదుగురు



రామారావు (44 యేళ్ళలో - 300 సినిమాలు), నాగేశ్వర్రావు (72 యేళ్ళలో - 255 సినిమాలు), శోభన్ బాబు (37 యేళ్ళలో -230 సినిమాలు), కృష్ణంరాజు (55 యేళ్ళలో-190 సినిమాలు), కృష్ణ (50 యేళ్ళలో- 350 సినిమాలు)

అయిదుగురూ కలిసి 1325 సినిమాలు.. అంటే యావరేజిగా యేడాదికి ఆరు సినిమాలు.. అంటే రోజూ రెండు షిఫ్టులు పనిచేస్తే కానీ పూర్తికానంత పని.

వీళ్ళు ఎటెంప్ట్ చేయని జానర్ లేదు.. సాంఘికం, పౌరాణికం, జానపదం, డ్రామా, కామెడీ, రొమాన్సు, ఫ్యామిలీ, యాక్షన్, హారరు.. అన్నీ చేశారు, తమ కెరీరు పీక్ లో ఉన్నప్పుడు కూడా ప్రయోగాలు చేయడానికి వెనుకాడలేదు..

ఒకపక్కన అభిమానులు పోస్టర్ల మీద భీకరమైన పేడ యుద్ధాలు చేస్కుంటూ ఉన్న సమయంలో మల్టీస్టారర్స్ చేశారు.. ఏ సీజీలూ లేని ఆర్గానిక్ ఫైట్లూ, డాన్సులూ చేశారు..

లేబొరేటరీ దగ్గర రిలీజుకి ముందు రోజులతరబడి జరిగే ప్రింటింగు ప్రాసెస్సులు, వందలకొద్దీ ప్రింట్లు, వేలకొద్దీ రీలు బాక్సులు, బస్తాలతో కలెక్షన్ల క్యాష్ తీసుకొచ్చి బ్యాంకుల్లో గుట్టగా పోసే డిస్ట్రిబ్యూటర్లు, రీలు బాక్సులు పట్టుకుని పరుగులు తీసే థియేటరు కుర్రాళ్ళు, టికెట్ కౌంటర్లదగ్గర చొక్కాలు చిరిగిపోయి మోచేతులు డొక్కుపోయేంతగా ముష్టియుద్ధాలు, హీరో ఎంట్రీలకు చిరిగిపోయే స్క్రీన్లు, ఈలల సౌండుకి పగిలిపోయే స్పీకర్లు, యాభై అడుగుల ఎత్తులో భారీ కటౌట్లు, పదిరూపాయల టికెటు వందకి అమ్ముడుపోయేంత బ్లాక్ ఫీవర్, శతదినోత్సవాలు, సిల్వర్ జూబిలీలు, యేడాదికి పైగా ఆడిన సినిమాలు , ప్లాటినం జూబిలీలు, లక్షలకు పైగా అమ్ముడుపోయే ఆడియో క్యాసెట్లు, డైలాగు డ్రామాలు

అన్నిటికన్నా ముఖ్యంగా తెలుగు భాషకున్న ప్రత్యేకమైన స్థానాన్ని పదిలంగా కాపాడారు.. జాతికి విపత్తు వచ్చినప్పుడు అందరూ ఒక్కటై అందరినీ ఒక్కతాటిమీదికి తీసుకొచ్చి జోలెపట్టి విరాళాలు సేకరించారు.. ఉద్యమాలు చేశారు, రాజకీయాల్లో పాల్గొన్నారు, పదవులు చేపట్టారు, పద్మశ్రీలు సంపాదించుకున్నారు,

ఆ తరం వెళ్ళిపోయింది.. ఈ యేడాది కృష్ణంరాజు, కృష్ణ ఇద్దరూ వెళ్ళిపోవడంతో ఒక శకం ముగిసిపోయింది..

ఈరోజు తెలుగు సినీ అభిమాని ప్రతి ఒక్కరూ వీళ్ళందరికీ నివాళిగా ఒక్క కన్నీటిబొట్టు రాల్చాల్సిన సమయం.. అందరినీ గుర్తుతెచ్చుకుని గుండెల్లోని అభిమానాన్ని పెదాలమీదికి తెచ్చుకుని హాయిగా ఓ చిరునవ్వు నవ్వాల్సిన సమయం. ఆ రోజులు మళ్ళీ రావు.

Date of Publication - 3rd of every month
PRAMUKHANDHRA

Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97
**November 2022**









The One Stop solution for all your Printing Needs

GOTETI GRAPHICS

64 (16), Thambiah Road, West Mambalam, Chennai - 600 033. INDIA
✆ : **098400 48941** E-mail : **gotetigraphics@gmail.com**

*Our print support creates a remarkable value in your business*